ప్రజాశక్తి
గురువారం 01 మే 2025
పేజీలు 12




కర్నూలు నంద్యాల

భరోసా లేని బతుకులు

- కార్మికులకు తప్పని వ్యధలు
- నేడు కార్మిక దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో లక్షల్లో కార్మికులు ఉన్నా వారి బతుకులకు మాత్రం భరోసా లేదు. రోజూ కార్మికులకు వ్యధలు తప్పడం లేదు. కార్మిక దినోత్సవం సందర్భంగా జిల్లాలోని కార్మికులపై ప్రజాశక్తి కథనం..

గని కార్మికులు

అవుకు మండలంలో 6 వేలకు పైగా గనుల్లో పని చేసే కార్మికులున్నారు. ఈ మూడు గ్రామాల పరిధిలో 250 పైగా గనులున్నాయి. ఇందులో పనిచేసే కార్మికులు ఎస్‌సి, బిసి మైనార్టీలే అధికంగా వున్నారు. ఒకరకం కార్మికులు గనుల్లో పని చేస్తే మరో రకం కార్మికులు బండల డిపోలో పనిచేస్తారు. గనుల యజమానులు ఈ కార్మకులకు ముందే కొంత సొమ్ము అప్పుగా ఇచ్చి పనిలోకి తీసుకుంటారు. అప్పు కొద్ది కొద్దిగా చెల్లిస్తూ మిగతా డబ్బులతో కుటుంబాన్ని పోషించుకోవాలి. బండలు ఒక ట్రాక్టర్ లోడింగ్ అన్‌లోడింగ్ కలుపుకొని నాల్గువందలిస్తారు. రెండోరకం కార్మికులు బండల డిపోలలో పనిచేస్తారు. వీరు డిపోలోని బండలను సైజులుగా (మిగతా 3వ పేజీ..)



ఉవ్వెత్తున ఎగిసిన కార్మిక పోరాటాలు

- ఎండి. అంజిబాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి.

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రభుత్వాలు కొనసాగించిన నిర్బంధాలను ఎదిరించి కర్నూలు జిల్లాలో కార్మిక పోరాటాలు కొనసాగాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు అన్నారు. మేడే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. 42 రోజులు పాటు సాగిన అంగన్వాడి ఉద్యమం జిల్లాను కుదిపివేసింది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని 9 ప్రాజెక్టులలోని వేలాదిమంది అంగన్వాడీ ఉద్యోగులు సమ్మెకు దిగారు. ప్రభుత్వం తీవ్రమైన నిర్బంధాన్ని కొనసాగించింది. అంగన్వాడి సెంటర్స్ తెరవాలని, లబ్ధిదారులకు అందిస్తున్న పాలు, గుడ్లు, ఆహార పదార్థాలు అందజేయాలని అంగన్వాడి సెంటర్స్ తాళాలు పగలగొట్టి సచివాలయ ఉద్యోగుల ద్వారా నడిపించాలని ప్రయత్నించారు. స్థానిక ప్రజలసహకారంతో అంగన్వాడి ఉద్యోగులు దాన్ని తిప్పి (మిగతా 3వ పేజీ..)



అభ్యుదయవాది బసవేశ్వరుడు

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా (వార్త 3లో..)



బిసి ఇందిరా రెడ్డికి ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న గ్రామ పెద్దలు

బిసి ఇందిరా రెడ్డికి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ ఆహ్వానం

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని యాగంటి పల్లె గ్రామంలో చౌడేశ్వరి దేవి విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి హాజరుకావాలని కోరుతూ గ్రామ పెద్దలు టిడిపి నాయకురాలు బిసి ఇందిరా రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. బుధవారం పట్టణంలోని మంత్రి బిసి జనార్దన్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో యాగంటి పల్లె ఉపసర్పంచి బండి మౌళేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు బిసి ఇందిరా రెడ్డిని కలిసి 1వ తేదీ నుండి 3వ తేదీ వరకు జరిగే చౌడేశ్వరి మాత విగ్ర ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవానికి హాజరుకావాలని కోరారు.

ఎర్రజెండా నాయకత్వంలోనే హక్కులు సాధ్యం

- ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల



ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ ఎర్రజెండా నాయకత్వంలో అనేక పోరాటాలు చేసి హక్కులు సాధించు కుంటున్నామని ఏపి అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల అన్నారు. మే డే పురస్కరించుకొని బుధవారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. జిల్లాలో సిఐటియు నాయకత్వంలో అంగన్వాడీలు అనేక పోరాటాలు చేసి వేతనాలు పెంచుకోవడం, ఇటీవలనే కూటమి ప్రభుత్వం గ్రాట్యూటీ ఇస్తున్నట్లు ప్రకటించిందన్నారు. కార్మిక లోకానికి మేడే పండుగ అన్నారు. ప్రతి ఒక్కరికీ మే డే శుభాకాంక్షలు తెలిపారు.

ప్రశాంతంగా ఎపి పాలిసెట్ పరీక్ష

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్ : నంద్యాల జిల్లాలో బుధవారం ఏపీ పాలిసెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, అబ్జర్వర్లు తెలిపారు. నంద్యాల, బనగానపల్లె, బేతంచర్ల, శ్రీశైలంలో 5682 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 5122 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని అధికారులు వెల్లడించారు.

చౌడేశ్వరి దేవస్థానానికి విరాళం

ప్రజాశక్తి - బనగానపల్లె : మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి దేవస్థానానికి భక్తులు రూ.35 వేలు విరాళంగా ఇచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ జి.కామేశ్వరమ్మ తెలిపారు. బుధవారం నంద్యాల పట్టణానికి చెందిన గంగిశెట్టి వెంకటేశ్వర్లు కుమారుడు గంగిశెట్టి తిమ్మయ్య, కుటుంబ సభ్యులు రూ. 35 వేలు చందాను డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి సమక్షంలో ఆలయ అర్చక వేదపండితులకు అందచేశారు.

బసవేశ్వర బోధనలు స్ఫూర్తిదాయకం : కలెక్టర్

- ఘనంగా బసవేశ్వర జయంతి వేడుకలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రతి ఒక్కరూ మహాత్మ బసవేశ్వర బోధనలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో బసవేశ్వర 892వ జయంతి సందర్భంగా జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, డిఆర్ఓ రాము నాయక్, జిల్లా పర్యాటక అధికారి సత్యనారాయణమూర్తి, వీరశైవ సంఘం నాయకులు తదితరులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 12వ శతాబ్దానికి చెందిన బసవేశ్వర భావనలు, ఆలోచనల గురించి తెలియజేయాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జయంతోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా విభజన తర్వాత మొట్టమొదటి సారి ఘనంగా బసవేశ్వర 892వ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12వ శతాబ్దంలో వర్ణాంతర వివాహాలు చేయడంతో పాటు స్త్రీ, పురుష భేద నిర్మూలన కోసం కృషి చేశారన్నారు. అన్ని కులాల వారు ఒకే చోట కూర్చుని భోజనం చేసే సాంప్రదాయాన్ని వీరి సమయంలో ప్రవేశ పెట్టారన్నారు. అంతకుముందు బసవేశ్వర గుడిపూజారి సాంబయ్య, నేషనల్ కళాశాల లెక్చరర్ మల్లిఖార్జున బసవేశ్వర ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వీరశైవ సంఘం నాయకులు జిల్లా కలెక్టర్ను శాలువ, మోమెంటోతో సత్కరించారు.



బసవేశ్వర చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ తదితరులు

మేడే లేబర్ దినం కాదు.. దీక్షా దినం

- శ్రామిక జనావళికి, కార్మిక, కర్షక ప్రజలకు మే డే శుభాకాంక్షలు
- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్



ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మేడే ఒక లేబర్ దినం కాదని, దీక్షా దినమని, శ్రామిక జనావళికి, కార్మిక, కర్షక ప్రజలకు సిపిఎం జిల్లా కార్యదర్శి టి. రమేష్ కుమార్ మే డే శుభాకాంక్షలు తెలిపారు. మేడే పురస్కరించుకొని ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. '1886లో అమెరికాలోని చికాగో నగరంలో హే మార్కెట్లో జరిగిన పోరాటంలో అమరులైన కార్మికులు, వారి ఆశయం, కార్మిక వర్గ విముక్తి, పని గంటల భారం తగ్గించేందుకు చేసిన పోరాట ఫలితంగా ఎనిమిది గంటల పని ప్రపంచ వ్యాప్తంగా అమలులోకి వచ్చింది.కానీ పెట్టుబడిదారుల లాభాల కోసం పని గంటలు పెంచాలంటూ వారానికి 90 గంటలు లేదా టార్గెట్లు పెట్టి కార్మికుల శ్రమశక్తిని దోపిడీ చేస్తూ పెట్టుబడిదారుల ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రభుత్వాలు రకరకాల పేర్లతో వారిని యజమానులకు బానిసలుగా మార్చే పద్ధతిలో చట్టాలు చేస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా, సాధించుకున్న హక్కులను నిలబెట్టు కునేందుకు దీక్షా దినంగా ఈ మేడేను జరుపుకోవాలి. సోషలిస్టు దేశాల కార్మిక వర్గానికి ప్రపంచంలోని అన్ని దేశాల్లో నయా ఉదారవాదానికి వ్యతిరేకంగా కార్మిక వర్గంపై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా పోరాడుతున్న కార్మిక వర్గానికి మేడే సందర్భంగా విప్లవ జోహార్లు అర్పిస్తున్నాం. అమెరికా వాణిజ్య సుంకాల వల్ల దేశాలపైన, ప్రజలపైన పెద్ద ఎత్తున ధరల భారానికి గురవుతున్నారు. పెట్టుబడిదారీ విధానాల ఫలితంగా దేశంలో అసమానతలు, పేదరికం, నిరుద్యోగం, ఆకలి, దారిద్రం పెరిగిపోతుంది. అధునాతన టెక్నాలజీ వల్ల కృతిమ మేధస్సు వల్ల కార్మికుల ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లుతుంది. శాశ్వత ఉపాధి కాకుండా కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ పేరుతో శాశ్వత ఉపాధికి దూరం చేస్తున్నారు. దేశంలో ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించడం దేశ సంపదను ప్రకృతి వనరులను పెట్టుబడుదారులకు ఈ ప్రభుత్వం కట్టబెడుతుంది. అయినా విద్యుత్తు, బొగ్గు, పోర్టు, బ్యాంకింగ్, భీమా తదితర సంస్థలలో ప్రైవేటుకు వ్యతిరేకంగా కార్మిక వర్గం విరోచితంగా పోరాటాలు చేస్తున్నారు. జన విశ్వాస్ చట్టం ద్వారా కార్పొరేట్ల దోపిడీకి శిక్షలు తగ్గించేసి, కార్మికుల హక్కులకై పోరాడుతున్న వారిని శిక్షించే విధంగా చట్టాలు రూపొందించారు. దేశంలో మతోన్మాద విధానాల ఫలితంగా కార్మిక వర్గ ఐక్యతకు ప్రమాదం ఏర్పడుతుంది. విద్యావ్యవస్థలో కూడా మైనార్టీలకు వ్యతిరేకంగా పాఠ్యాంశాలు బోధించి మత విద్వేషాలు పెంపొందిస్తున్నారు. వీటన్నిటికీ వ్యతిరేకంగా కార్మిక కర్షక ఐక్యత ద్వారా పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా సోషలిజం స్థాపన ధ్యేయంగా భవిష్యత్తులో పోరాటం చేద్దాం. ఈ మేడే సందర్భంగా దీక్షా వహించాలి' అని తెలిపారు.

కార్మికులకు అండగా ఎర్రజెండా

- రైల్వే గూడ్స్ ముఠా వర్కర్స్ యూనియన్ నంద్యాల గౌరవాధ్యక్షులు తోట మద్దులు



ప్రజాశక్తి - నంద్యాల కలెక్టర్

కార్మికుల హక్కులు కాపాడటంలో, పేద పీడిత ప్రజలకు అండగా ఎర్రజెండా ఉంటుందని, ఎర్రజెండా నీడలో కార్మికులు తమ హక్కులను సాధించుకున్నారని సిఐటియు అనుబంధ రైల్వే గూడ్స్ ముఠా వర్కర్స్ యూనియన్ నంద్యాల గౌరవాధ్యక్షులు తోట మద్దులు పేర్కొన్నారు. గురువారం మే డే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. నాడు 60 మందితో ఉన్న యూనియన్ నేడు 150 మందితో పని చేస్తున్నారన్నారు. రైల్వే గూడ్స్ షెడ్ హమాలీలు 1974 కంటే ముందు నుండి పని చేస్తున్నారని తెలిపారు. రైల్వే వ్యాగన్లు వచ్చినప్పుడే వీరికి పని తరువాత పని ఉండదన్నారు. కార్మికులను రైల్వే అధికారులు ఆదుకోవాలని సూచించారు. ఇక్కడ సిఐటియు నాయకత్వాన హమాలీలు రైల్వే గూడ్స్ షెడ్ ముఠా వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేసుకున్న తరువాత వేతన రేట్లు పెంచుకున్నారని తెలిపారు. ప్రతి రెండేళ్లకు ఒక్కసారి వేతన రేట్లపై అక్కడి కాంట్రాక్టర్తో ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. ఎర్రజెండా నాయకత్వంలో స్థానిక సమస్యలపై పని చేస్తున్నారని, ఇక్కడ పని చేసే కార్మికులకు పని ప్రదేశంలో సౌకర్యాలు ఉండటం లేదని, వాటి కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

బాల్య వివాహం చేస్తున్న తల్లిదండ్రులపై కేసు నమోదు

ప్రజాశక్తి - రుద్రవరం : రుద్రవరం సమీపంలోని గుట్టకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బాల్య వివాహం చేస్తున్న తల్లిదండ్రులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మండలం కురుకుంద గ్రామానికి చెందిన మైనర్ బాలికను రుద్రవరం గ్రామానికి చెందిన అబ్బాయితో గుట్టకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం దగ్గర వివాహం జరగగా ఆళ్లగడ్డ ఐసిడిఎస్ సిడిపిఓ తేజేశ్వరి సమాచారం మేరకు అక్కడికి చేరుకొని వారిని పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చామన్నారు. ఫిర్యాదు మేరకు అబ్బాయి, అమ్మాయి తల్లిదండ్రులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కార్మిక పక్షాన ఎర్రజెండా పోరాటం

- సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి కె.మహమ్మద్ గౌస్



ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కార్మికుల హక్కుల కోసం, వారి సమస్యల కోసం ఎర్రజెండా ముందుండి పోరాడుతుందని సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి కె.మహమ్మద్ గౌస్ పేర్కొన్నారు. గురువారం మే డే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. సిఐటియు నాయకత్వాన ఎర్రజెండా కింద కార్మికులు పోరాడి అనేక సమస్యలను పరిష్కరించుకున్నట్లు చెప్పారు. ముఖ్యంగా ఈ రెండేళ్ల కాలంలో ఆర్ఏఆర్ఎస్ పోరాటం చెప్పుకోదగ్గదన్నారు. సారవంత భూములను, విత్తన తయారీకి పండించే భూములను అప్పనంగా మెడికల్ కళాశాలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ 100 రోజులు అక్కడి కూలీలు సిఐటియు నాయకత్వాన పోరాటం సాగించారని తెలిపారు. అలాగే గత వైసిపి ప్రభుత్వం 44 మంది మున్సిపల్ కార్మికులను తొలగిస్తే సిఐటియు నాయకత్వాన మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి, గౌరవ కోర్టు ద్వారా మళ్లీ 44 మందిని విధుల్లో చేర్పించి నట్లు తెలిపారు. కార్మికుల కూలి రేట్ల కోసం 16 రోజుల పాటు సమ్మె చేసి సివిల్ సప్లై హమాలీలు వేతనాలు పెంచుకున్నారని తెలిపారు. వీటితోపాటు ఇసుక, భవన నిర్మాణ కార్మికులు సమస్యలపైన సిఐటియూగా పోరాటాలు సాగించామన్నారు. రాబోయే కాలంలో ఎర్రజెండా నాయకత్వంలో మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు కొనసాగిస్తామన్నారు.

కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో ఎల్ఐసి నిర్వీర్యం

- మేడే స్ఫూర్తితో ఎల్ఐసి ని కాపాడుకోవాలి
- ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ నంద్యాల సెక్రెటరీ ఏ.రమేష్ బాబు



ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో లైఫ్ ఇన్సూరెన్స్ విభాగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తూ నిర్వీర్యం చేస్తుందని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ నంద్యాల శాఖ సెక్రటరీ ఏ.రమేష్ బాబు విమర్శించారు. గురువారం మే డే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. 1956 సెప్టెంబర్ 1వ తేదీ 256 ప్రైవేట్ భీమా కంపెనీలను విలీనం చేసి రూ. 5 కోట్ల పెట్టుబడితో కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసిగా నామకరణం చేసి భారతదేశానికి జాతీయం చేసిందన్నారు. అప్పటి నుండి దేశ ప్రజల నమ్మకాన్ని చూరగొంటూ దినదిన ప్రవర్ధమానంగా ఎదిగి లక్షల కోట్ల ఆస్తిని, రూ.44.31 లక్షల కోట్ల లైఫ్ ఫండ్ను కలిగి ప్రపంచంలోనే అతిపెద్ద బీమా కంపెనీగా ఎదిగిందని తెలిపారు. 30 కోట్ల మంది పాలసీదారులను కలిగి ఉందన్నారు. ప్రజల సొమ్ము ప్రజలకు అన్న నినాదంతో ఏర్పడిన ఎల్ఐసి దేశ అభివృద్ధిలో భాగంగా రైల్వే, విద్యుత్తు, రోడ్స్, సాగునీటి ప్రాజెక్టులలో పెట్టుబడులు పెడుతుం దన్నారు. ఇంకా ప్రజలకు ఉపయోగపడే అనేక కార్యక్రమాల్లో పెట్టుబడులు పెట్టిందన్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసిని బలహీనపరిచే ఉద్దేశంతో భీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడును 100 శాతం అనుమతి ఇచ్చిం దన్నారు. ఎల్ఐసిలో ఐపిఒ ద్వారా వాటాల విక్రయాన్ని చేపట్టిందన్నారు. వీటిన్నింటినీ ఉద్యోగులుగా తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. సంస్థ కోసం శ్రమించి నమ్మకాన్ని పెంచుకున్నామని, సంస్థలో కొన్ని అపరిష్కృత సమస్యలపై ఆందోళనగా ఉందన్నారు. ఎల్ఐసి ఉద్యోగు లందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని, మూడు, నాలుగవ తరగతి ఉద్యోగుల నూతన నియామకాలు చేపట్టాలన్నారు. ఇతర సమస్యల పరిష్కారానికి యాజమాన్యం అలసత్వం ప్రదర్శిస్తుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం ముందుండే ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మే 20వ తేదీన దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చిందని తెలిపారు. ఈ సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ప్రస్తుతం దేశంలో 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్లుగా కుదించిందని, కార్మిక వర్గ ఐక్యతను నిర్వీర్యం చేయడానికి కార్పొరేట్ శక్తులు చేస్తున్న ప్రయత్నాలు, హక్కుల మీద జరిగే దాడులను తిప్పి కొట్టడానికి త్వరలో దేశవ్యాప్తంగా చేయబోయే ఐక్య నిరసనలకు మేడే కార్యక్రమాలు మరింత స్ఫూర్తి కలిగిస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు.

భరోసా లేని బతుకులు

మొదటి పేజీ తరువాయి.. విడగొడ్తారు. వీరికి పొద్దంత పనిచేస్తే రూ.200 నుండి రూ.300 వరకు కూలీ వుంటుంది. వీరిలో ఏ కార్మికుడికి ఎటువంటి ప్రమాదం జరిగినా బీమా ఉండదు.

బేతంచర్ల నాపరాతి గని కార్మికులు

బేతంచర్లలో 26 నాపరాతి గనులున్నాయి. మూడురకాల కార్మికులున్నారు. గనుల్లో పని చేసే కార్మికులు, లోడింగ్ అన్‌లోడింగ్ కార్మికులు, బండలను పాలీష్ చేసే కార్మికులు. పాలీష్‌బండలను కట్టింగ్ చేసేందుకు రూ.200 ఇస్తారు. మహిళా కార్మికులు లోడింగ్‌లో పాల్గొంటే రూ. 120 రూపాయలిస్తారు. బేతంచర్లలో 600 బండల పాలీషింగ్ ఫ్యాక్టరీలున్నాయి. గనుల మీద ఫ్యాక్టరీల మీద బతికే కార్మికులకు క్రమేపి జీవనాధారం లేక వలసకెళ్లిన పరిస్థితి కనిపిస్తుంది.గనికార్మకులకు సొంత ఇళ్ళు కూడాలేవు. అద్దె ఇళ్ళల్లోనే ఎక్కువగా నివాసం వుంటున్నారు. గనుల్లోను ప్రమాదాలు జరిగితే వైద్య సదుపాయం లేదు. ఈ నాపరాతి గనుల్లో సుమారుగా అన్ని రకాల కార్మికులు కలుపుకొని పది నుండి 15 వేల మంది ఉంటారు. లోడింగ్ అన్ లోడింగ్ కార్మికులకు ఎక్కువగా ప్రమాదాలు అధికంగా జరుగుతుంటాయి. ఇక్కడ పనిచేసే కార్మికులకు కనీసం గుర్తింపు కార్డులు కూడా లేవు.

కర్నూలు ఆటో కార్మికులు

వీరిలో చదువులేని ఆటో కార్మికులు, చదువకున్న ఆటో కార్మికులు, సాధారణ ఆటో కార్మికులుగా మూడు రకాలుగా ఉన్నారు. చదువులేని ఆటో కార్మికులు సొంత ఆటోలు కూడా లేక రోజుకు రూ.200 అద్దె చెల్లించి ఆటోలు బాడుగకు తీసుకుని జీవనం చేసే ఆటో కార్మికులు. వీరు ఎక్కువగా నిరక్ష్యరాస్యులు. ఉద్యోగాలు రాక నిరుద్యోగ సమస్యతో అటో కార్మికులుగా మారినవారు కూడా ఉన్నారు. ఈ వర్గంలో బి.టెక్, ఎంటెక్ తో పాటు ఎన్నో ప్రొఫెషనల్ డిగ్రీలు చదివినవారున్నారు. చదివినా ఎటువంటి అవకాశాలు లేనివారున్నారు. అనేక పోటీ పరీక్షలకు పగలు కోచింగ్‌ల చుట్టూ రాత్రి బతుకుకోసం ఫీజుల కోసం ఆటోలు నడిపే వారున్నారు. కర్నూలు నగర వాసులకంటే వేరే ప్రాంతాల నుండి వచ్చిన వారే అధికం. వీరి సంపాదన అన్నీ పోను రోజుకు రూ.500 నుండి రూ.600. సాధారణ ఆటోకార్మికులు ఆటోనే కుటుంబానికి ప్రధాన ఆదాయవనరుగా వుంటుంది. వీరిలో సొంత ఆటోలున్నవారు. బాడుగ ఆటోలున్నవారు ఉన్నారు. చిన్న ఆటో రూ.200 బాడుగ, పెద్ద ఆటోకు రూ.600 బాడుగ. టాటా ఏస్ రూ.800 బాడుగకు లభిస్తాయి. వీరు కార్మకసంఘాల్లో సభ్యులుగా ఉన్నవారు ఆధికంగా ఉన్నారు. వీరు ప్రమాదానికి గురైనప్పుడు, పోలీసు కేసుల సందర్భాలలో కార్మిక సంఘాల మధ్యవర్తిత్వంతో సమస్యలను పరిష్కరించుకుంటారు. నగరంలో ఆటోలసంఖ్య గణనీయంగా రోజు రోజుకు పెరగడం మూలంగా డిమాండ్ తగ్గంది. లింక్ రూ.20 కొనసాగుతుండగా కొంత మంది లింక్‌తో ప్రమేయం లేకుండా ఆటోలను నడుపుతూ ఎంతో కొంత ఆదాయం సరే నన్న చందాగా ఆటోలు నడుపుతున్నారు. ప్రమాద బీమా సౌకర్యం లాంటివి వీరికి లేవు. వీరిలో గుర్తింపు కార్డులు లేని వారు చాలా మంది వున్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చి స్థిర పడ్డవారు, పంటలు పండక, గ్రామాల్లో వ్యవసాయ పనుల్లేక నగరానికొచ్చి ఆటో కార్మికులైన వారున్నారు. వీరిలో అధికంగా పది లేదా అంతకంటే లోపు తరగతి చదువుకున్న వారు అధికంగా ఉన్నారు. 90శాతం మందికి సొంత ఇళ్ళు లేవు. అద్దె ఇళ్ళలోనే నివాసం.

ఉవ్వెత్తున ఎగిసిన కార్మిక పోరాటాలు

మొదటి పేజీ తరువాయి.. కొట్టారు. ఏస్మా చట్టాన్ని ప్రయోగించారు. అదరకుండా, బెదరకుండా దాన్ని ఎదుర్కొన్నారు. తొలగిస్తామని బెదిరించారు. భయపడకుండా తాడోపేడో తేల్చుకుంటాం. అంటూ విజయవాడ బయలుదేరి ప్రభుత్వ మెడలు వంచి విజయం సాధించారు.

మున్సిపల్ కార్మికులు 26 రోజులపాటు వీరోచితంగా పోరాడి విజయం సాధించారు. ఎమ్మిగనూరు, గూడూరు ఆదోని, కర్నూలులో మునిసిపల్ కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. ఎమ్మిగనూరు గూడూరులో పోటీ కార్మికులను దింపి సమ్మెను విచ్చిన్నం చేయాలని చూసినప్పటికీ కార్మికులు ధైర్యంగా ఎదుర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న క్లాప్ డ్రైవర్స్ 29 రోజులు సమ్మె చేసి విజయం సాధించి పెండింగులో ఉన్న తొమ్మిది నెలల వేతనాలు చెల్లించాలని ఆందోళన చేశారు. ఆందోళనలు చేస్తున్న కార్మికులను మీరు అవసరం లేదు. అంటూ తొలగింపు కార్యక్రమం చేపట్టారు. 29 రోజులు సమ్మె చేసి వివిధ రూపాలలో ఆందోళనలు చేసి డ్యూటీలో సాధించుకోవడమే కాకుండా పెండింగ్ వేతనాలు సాధించుకున్నారు.

ఆశా వర్కర్లు ఆందోళన కార్యక్రమాలు జిల్లాలో జరిగాయి. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు ఉద్యోగ భద్రత కోసం పెండింగ్ వేతనాలకు పోరాడి విజయం సాధించారు.

ఆర్‌టిసి బస్టాండ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు తొలగింపునకు వ్యతిరేకంగా ఆందోళనలు చేశారు. కర్నూలు మార్కెట్ హమాలీ కార్మికులు పని భద్రత మార్కెట్లో మెరుగైన సౌకర్యాలకు ఆందోళనలు చేశారు. వేర్ హౌస్ హమాలీలు ప్రభుత్వ గోడౌన్లలో సరుకు దించాలని ఆందోళన చేసి విజయం సాధించారు.

ఆటోరంగంలో వస్తున్న మార్పులకు వ్యతిరేకంగా ఆటో కార్మికులు అనేక ఆందోళనలు, ఫైన్లకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేసి విజయం సాధించారు. లైసెన్స్ విధానంలో తెచ్చిన మార్పులకు వ్యతిరేకంగా ఆందోళనలు చేశారు. మెప్మాలో పనిచేస్తున్న ఆర్‌పిలు పని భారానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేసి విజయం సాధించారు.

108 ఉద్యోగులు ఆందోళనలు చేసి జీతాలు పెంచుకున్నారు. 104 ,102 ఉద్యోగులు పని భద్రత కొరకు ఆందోళనలు చేశారు. మెడికల్ రంగంలో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీలు ఆందోళన చేసి 175 మందికి ప్రమోషన్లు ఇప్పించుకున్నారు. సర్వ శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు 15 రోజులు సమ్మె చేసి విజయం సాధించారు. మే డే స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ,మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు ఉద్యోగులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

అభ్యుదయవాది బసవేశ్వరుడు : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సమ సమాజం నిర్మాణానికి పోరాడిన అభ్యుదయ వాది మహాత్మా బసవేశ్వరుడు అని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష కొనియాడారు. బుధవారం మహాత్మా శ్రీ బసవేశ్వర 892 వ జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా యువజన సంక్షేమ శాఖ – సెట్కూర్ నిర్వహించారు. మహాత్మా శ్రీ బసవేశ్వర చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాష, వీరశైవ, జంగమ సంఘాల నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సెట్కూర్ సిఇఒ డాక్టర్ వేణుగోపాల్, వీరశైవ ఐక్య సంఘం అధ్యక్షులు ఎజి.మల్లికార్జునప్ప, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరప్ప, సంఘ సభ్యులు విశ్వేశ్వరయ్య, శివరాజ్, యాగంటయ్య, శెట్టి వీర శేఖరప్ప, యాగంటి ఈశ్వర్, మల్లికార్జునయ్య, తదితరులు పాల్గొన్నారు.



నివాళ్లులర్పిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

గాలివాన బీభత్సం

- సింగనపల్లెలో పిడుగు పడి 6 జీవాలు మృతి
- అవుకు, రుద్రవరంలో కూలిన భారీ చెట్లు
- శ్రీశైలంలో వడగండ్ల వర్షం

జిల్లాలోని అవుకు, రుద్రవరం, శ్రీశైలం మండలాల్లో బుధవారం గాలివాన బీభత్సవం సృష్టించింది. అవుకు మండలం సింగనపల్లె గ్రామ సమీపంలో పిడుగు పడి ఆరు జీవాలు మృతి చెందాయి. రుద్రవరంలో భారీ చెట్టు విరిగి ట్రాక్టర్‌పై పడింది. శ్రీశైలంలో వడగండ్ల వర్షం కురిసింది.

ప్రజాశక్తి - అవుకు/రుద్రవరం/శ్రీశైలం

అవుకు పట్టణంలో గాలివాన బీభత్సం సృష్టించింది. పెద్దపెద్ద చెట్లు నేలకొరిగాయి. మాజీ సర్పంచ్ చల్లా అమర్నాథ్ రెడ్డి ఇంటిపై భారీ చెట్టు కూకటివేళ్లతో సహా కూలిపోవడంతో ఇల్లు కొంతమేర దెబ్బతింది. అకస్మాత్తుగా సాయంత్రం గాలి వాన బీభత్సవానికి పట్టణంలో సుమారు 12 చెట్ల వరకు నేలకొరిగాయని స్థానికులు తెలిపారు. చెట్లు విరిగిపడడంతో అక్కడక్కడ విద్యుత్ తీగలు తెగిపడటంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

పిడుగు పడి ఆరు జీవాలు మృతి : అవుకు మండలంలోని సింగన పల్లె గ్రామంలోని పొలాల్లో బుధవారం గాలివానకు పిడుగు పడి కొత్తపేట బోయ ప్రసాద్‌కు చెందిన ఆరు జీవాలు మృతి చెందాయి. అకస్మాత్తుగా వచ్చిన గాలివానకు ఉరుములు మెరుపులతో పిడుగు పడింది. దగ్గరలో ఉన్న జీవాలు మృతి చెందాయి. మరికొద్ది దూరంలో 100 నుంచి 150 జీవాలు ఉన్నాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.

రుద్రవరం : రుద్రవరం మండలంలో బుధవారం భీకర గాలులతో వర్షం కురిసింది. పెద్ద పెద్ద చెట్లు విరిగిపడ్డాయి. చోటుచేసుకుంది. హరి నగరం గ్రామానికి చెందిన ఎర్రన్న తన ఇంటి ముందర నిలిపి ఉంచిన ట్రాక్టర్‌పై పెద్ద చెట్టు విరిగిపడింది. గ్రామ సమీపంలో నవహోబిలం కాంప్లెక్స్ మైదానంలో ఆరబెట్టిన వరి ధాన్యం వర్షం కారణంగా పూర్తిగా తడిసిపోయింది. అకాల వర్షాల కారణంగా పంట ఇంటికి చేరే



మృతి చెందిన మేకలు

సమయంలో ధాన్యం పూర్తిగా తడిసి పోతుం డడంతో రైతులకు నష్టాలను మిగులు తున్నాయి. తడిచిన దాన్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ధాన్యమును కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

శ్రీశైలం ప్రాజెక్టు : శ్రీశైల దేవస్థానంలో బుధవారం సాయంత్రం కురిసిన వడగండ్ల వానతో పుణ్యక్షేత్రం చల్లబడింది. ఎండ తీవ్రతతో ఉన్న స్థానికులు, దర్శనానికి వచ్చిన భక్తులు కొంత ఉపశయనాన్ని పొందారు. రెండు గంటల నుండి ఉరుములు మెరుపులతో కూడిన గాలి వానతో పాటు వడగండ్ల వాన కురిసింది. భక్తులు వసతి గృహాలకే పరిమితమయ్యారు.



అవుకు : మాజీ సర్పంచి ఇంటిపై విరిగిపడిన చెట్టు



ట్రాక్టర్‌పై విరిగిపడిన చెట్టు

వృద్ధులకు పండ్లు, మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - చాగలమర్రి : మండలంలోని నగళ్ళపాడు గ్రామ సమీపంలోని క్రైస్తవ వృద్ధాశ్రమంలో బుధవారం పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. అనాధ రక్షక్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ వాసవి డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ బడిగంచెల రఘురామ్ సహకారంతో అక్షయతృతీయ సందర్భంగా వృద్ధులకు పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనాధ రక్షక్ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వల్లంకొండు సాయి సుదర్శన్ రావు, కార్తీక్, తరుణ్, ప్రదీప్, కనగాని సురేంద్ర, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న దృశ్యం


వివరాలు తెలుసుకుంటున్న జడ్జి

సబ్ జైల్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పట్టణంలోని సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లీలా వెంకట శేషాద్రి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ముద్దాయిలతో వారికి కావాల్సిన సౌకర్యాల గురించి ఆరా తీశారు. భోజన వసతి, వైద్య సదుపాయం అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. న్యాయవాది అందరికీ ఉన్నారా లేరా అని అడుగుతూ ఆర్థిక స్థోమత లేక న్యాయవాదిని నియమించుకోలేనివారికి న్యాయ సేవాధికార సంస్థల ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు. ఏదైనా న్యాయపరమైన సమస్యలు ఉన్నట్లయితే జైల్లో ఉన్న న్యాయ సేవ కేంద్రం ద్వారా సహాయం పొందవచ్చన్నారు. ఆన్లైన్ నెంబర్ 15100 ద్వారా గాని తెలుపవచ్చన్నారు. సబ్ జైల్లో పరిమితికి మించి ముద్దాయిలు ఉన్నారని గుర్తించి జైలు సూపరిండెంట్‌కు తగిన సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సబ్ జైల్ సూపరిండెంట్ సెల్వంత్, ప్యానల్ న్యాయవాదులు లార్డ్ వర్డ్ వక్స్ మోసస్, షహీనా బేగం, మెడికల్ ఆఫీసర్ నాగ మస్తాన్ తదితరులు ఉన్నారు.

సీనియర్ అధికారి బదిలీ

ప్రజాశక్తి - కోవెలకుంట్ల : కోవెలకుంట్ల మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అధికారిగా పని చేస్తున్న వి.రామసుబ్బయ్యను ప్రమోషన్‌పై పరిపాలనాధికారిగా ఆళ్లగడ్డ మండల పరిషత్ కార్యాలయానికి బదిలీ చేసినట్లు ఎంపీడీవో వరప్రసాద్ తెలిపారు. ప్రతి వ్యక్తికి బదిలీ తప్పనిసరి అన్నారు.

పెద్దమ్మ తల్లి జాతరలో పాల్గొన్న మంత్రి

ప్రజాశక్తి - గోస్పాడు : మండలంలోని యాళ్ళూరు గ్రామ పెద్దమ్మ తల్లి జాతరలో ఆ గ్రామ నాయకుడు గంగుల శంకర్ రెడ్డి ఆహ్వానం మేరకు మంత్రి ఎన్ఎండి ఫరూఖ్ బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గోస్పాడు మండలంతో పాటు నంద్యాల జిల్లా మొత్తం అభివృద్ధి పథంలో నడిచే విధంగా పెద్దమ్మతల్లి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, గోస్పాడు, నంద్యాల మండల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కుందూనదిలో నీటమునిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కోవెలకుంట్ల : మండలంలోని రేవనూరు గ్రామానికి చెందిన గొల్ల బాలుడు కుమారుడు జయవర్ధన్ (22) కుందూ నదిలో నీట మునిగి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. జయవర్ధన్ గొర్రెలు మేపడానికి ప్రతిరోజు కుందూ నది సమీపంలోకి తీసుకెళ్లేవారు. గొర్రెలు అవతల ఒడ్డుకు దాటడంతో జయవర్ధన్ కూడా దాటడానికి ప్రయత్నం చేసి లోతు ఎక్కువగా ఉన్న చోట నీట మునిగి ఊపిరాడక మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పొదుపు మహిళలకు రుణాలు మంజూరు

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్ : బనగానపల్లి మండలం స్థానిక డిఆర్‌డిఏ వెలుగు కార్యాలయం పరిధిలో పొదుపు మహిళలకు 40 లక్షల రూపాయలు రుణాలు మంజూరైనట్టు ఎపిఎం అడ్డాకుల శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 2 స్వయం సహాయక సంఘాల నుండి 20 మంది డ్వాక్రా మహిళలకి 40 లక్షల రూపాయలు రుణాలు మంజూరు కావడంతో లబ్ధిదారులు సుస్థిరమైన జీవనోపాధి ఏర్పాటు చేసుకొని, ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. రికవరీ సకాలంలో చెల్లించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం పరుచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిసి ప్రసాద్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ నిర్వీర్యం : యూనుస్

ప్రజాశక్తి - నంద్యాల రూరల్ : గత వైసిపి ప్రభుత్వం ముస్లిం మైనారిటీ ఫైనల్స్ కార్పొరేషన్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ ఎం డి యునుస్ పేర్కొన్నారు. బుధవారం మైనార్టీ సబ్సిడీ రుణాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముస్లిం హక్కుల పోరాట సమితి నాయకులు సయ్యద్ గులాబ్ బాషా రాష్ట్ర కో కన్వీనర్ సయ్యద్ ఇక్బాల్ నంద్యాల జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ ఖాజా బాబా సెక్రెటరీ సయ్యద్ మాలి పాల్గొన్నారు.

నంద్యాలలో పారిశుధ్య పనులు అస్తవ్యస్థం

- శానిటేషన్ సిబ్బంది నిర్లక్ష్యం వీడాలి

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ షేక్ మాబున్నీ సా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలో పారిశుధ్యం పనులు ఘోరంగా తయారయ్యాయని, శానిటేషన్ సిబ్బంది నిర్లక్ష్యం వీడాలని మున్సిపల్ ఛైర్మన్ షేక్ మాబున్నిసా పేర్కొన్నారు. బుధవారం నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఛైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. అజెండాలోని పలు అంశాలకు ఆమోదం తెలిపారు. అయితే సాయిబాబ నగర్ మెయిన్ రోడ్డు 40 నుంచి 60 అడుగులకు వెడల్పు చేసేందుకు ఆమోదానికి కౌన్సిల్ ముందు ఉంచగా కౌన్సిలర్ కృష్ణ మోహన్ అభ్యంతరం తెలిపారు. అవసరమున్న చోట చేయకుండా ఇక్కడ రోడ్డు వెడల్పు చేయడం ఏమిటని ప్రశ్నించారు. బంగారు షాపుల ఏరియాలో ఇరుకుగా ఉండటం, అక్కడ రద్దీగా ఉంటుందని తక్షణమే ఆ ఏరియాలో రోడ్డు వెడల్పుకు చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతో ఆ నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు. నంద్యాల నడిబొడ్డున సాయిబాబా టెంపుల్ పక్కన మున్సిపల్ స్థలంలో వైన్ షాపులు నిర్వహిస్తున్నారని, ఆలా నిర్వహించడానికి అవకాశం ఉందా అని ఒక సభ్యుడు ప్రశ్న లేవనేత్తారు. పరిశీలిస్తామని, మున్సిపల్ స్థలంలో వైన్ షాపు నిర్వహణకు అవకాశం లేదంటే తప్పక చర్యలు తీసుకుంటామని కమిషనర్ సభ్యులకు హామీ ఇచ్చారు. అలాగే ప్రతి ఏటా 15 శాతం ఇళ్ల పన్ను పెంచుతూ పోతే ప్రజలు ఇళ్లు అమ్ముకొని పోవాల్సి వస్తుందని కో ఆప్షన్ సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. పన్నుల పెంపును వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపుదామన్నారు. తమ వార్డులో రోడ్డు పనులు చేపట్టలేదని, మా పదవీ కాలం అయిపోయాక పనులు చేపట్టేలా అధికారులు ఉన్నారని కౌన్సిలర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఇలా వార్డులలోని పలు సమస్యలను కౌన్సిలర్లు సభ దష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో మున్సిపల్ స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. పన్నుల పెంపుపై కౌన్సిల్ సమావేశం ఓ నిర్ణయం తీసుకుని ప్రజలకు మేలు జరిగేలా పెంపు వద్దని తీర్మానం చేద్దామని కోరారు.


సంతాపం తెలుపుతున్న చైర్మన్, కౌన్సిల్ సభ్యులు, అధికారులు

పహాల్గం మృతులకు సంతాపం : పహాల్గంలో ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన యత్రికులకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం 2 నిమిషాలు సంతాప సూచికంగా మౌనం పాటించి నివాళ్ళు అర్పించారు.

మున్సిపల్ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి

- సిఐటియు ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మున్సిపాలిటీలోని చేస్తున్న అప్కాన్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి కెఎండి మహమ్మద్ గౌస్, ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రామాంజనేయులు, కార్యదర్శి రంగనాథ్ ఉపాధ్యక్షులు బాలదుర్గ, ఆదాం, సహాయ కార్యదర్శి భాస్కరచారి, బిబీ తదితరులు కమిషనర్ పి.నిరంజన్ రెడ్డిని కోరారు. బుధవారం నంద్యాల మున్సిపల్ కమిషనర్‌ను వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ శాఖలలో మాదిరిగానే మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కార్మికులందరికీ 62 సంవత్సరాల పదవి విరమణ వయస్సు పెంచాలని కోరారు. నంద్యాల పట్టణంలో వాటర్ వర్క్స్, స్ట్రీట్ లైటింగ్, ఆఫీస్ స్టాఫ్, పంప్ హౌస్ వర్కర్స్, వాల్ ఆపరేటర్స్, డిస్ట్రిబ్యూషన్ వర్కర్స్ మొత్తం 268 మంది కార్మికులు ఆప్కాస్‌లో పని చేస్తున్నారని, ఈ మధ్యకాలంలో రోశమ్మ, ఖైరున్ బి, మురళిలకు 60 సంవత్సరాలు ముగిసిందని, వెంకటేశ్వర శర్మ, వెంకటరామయ్యలకు కమీషనర్ నోటీసులు ఇచ్చారన్నారు. వెంకటేశ్వర శర్మ, వెంకటరామయ్యకు మరో మూడు నెలలు వయో కాల పరిమితి ఉందని, వెంటనే వాటిని సవరించి విధుల్లోకి తీసుకోవాలన్నారు. రిటైర్మెంట్ టెనిఫిట్స్ సౌకర్యాలను కల్పించాలని, బెనిఫిట్స్ (10 సంవత్సరాలకు రూ.75,000) ఇవ్వాలని తదితర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉద్యోగ విరమణ సహజం : మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఉద్యోగ విరమణ పొందడం సహజమని, విధుల్లో ఉన్నప్పుడు బాగా పని చేసిన వారిని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకుంటారని మున్సిపల్ కమీషనర్ పి.నిరంజన్ రెడ్డి అన్నారు. బుధవారం నంద్యాల మున్సిపల్ వాటర్ వర్కర్స్, స్ట్రీట్ లైట్స్ విభాగంలో విధులు నిర్వహిస్తూ విరమణ పొందిన కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు రోశమ్మ, ఖైరున్ బిలను ఏపీ వాటర్ వర్కర్స్, స్ట్రీట్ లైట్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కమిషనర్ మాట్లాడుతూ విరమణ పొందిన ఔట్సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులు శేష జీవితం ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఎంఈ గురప్ప యాదవ్, డిఈ నాగభూషణ్ రెడ్డి తదితరులు మాట్లాడారు. అంతకుముందు సిఐటియు పట్టణ కార్యదర్శి కేఎండి గౌస్ మాట్లాడుతూ రిటైర్ అయ్యాక కాంట్రాక్టు ఉద్యోగులకు ఎలాంటి బెనిఫిట్స్ ఉండకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం కొంత సొమ్ము ఇవ్వాలని కోరారు. 62 ఏళ్లు సర్వీస్ పెంచాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. విరమణ పొందిన తరువాత యూనియన్‌గా వారికి భవిష్యత్‌లో సహాయం చేయడానికి ప్రయత్నం చేయాలని సూచించారు. ఏపీ మున్సిపల్ వాటర్ వర్క్స్ స్ట్రీట్ లైట్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు భాస్కరాచారి. వి రంగనాథ, రామాంజనేయులు, బాల దుర్గన్న, సతీష్, ప్రసాదరావు, వినోద్, నాగేశ్వరరావు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.


విరమణ పొందిన కార్మికులను సన్మానిస్తున్న కమిషనర్ తదితరులు

సిహెచ్‌ఒల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి

- మూడో రోజు కొనసాగిన నిరసన

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

వైద్య ఆరోగ్య శాఖలోని ఎన్‌హెచ్‌ఎం కింద సిహెచ్‌ఒలుగా గ్రామాలలో పని చేస్తున్న ఆరోగ్య సిబ్బంది తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మెలో భాగంగా మూడవరోజు నిరసన కార్యక్రమం చేపట్టినట్లు ఏపి ఎంసిఏ యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ శివకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ భాస్కర్ తెలిపారు. బుధవారం నంద్యాల పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం దగ్గర, బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ముందు కమ్యూనిటీ ఆరోగ్య అధికారులు ఒంటి కాలుపై నిలబడి నిరసన తెలియజేసారు. ఈ సందర్భంగా ఏపిఎంసిఏ యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ శివకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ భాస్కర్, సెక్రటరీ అఖిల్, భార్గవ్ మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్యశాఖలోని యన్‌హెచ్‌ఎం కింద కమ్యూనిటీ ఆరోగ్య అధికారులుగా పని చేస్తున్న సిబ్బంది గత 2 సంవత్సరాలుగా జీతభత్యాల విషయంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నా మన్నారు. కార్యక్రమంలో ఏపిఎంసిఏ జిల్లా కమ్యూనిటీ ఆరోగ్య అధికారులు పాల్గొన్నారు.


ఒంటి కాలు పై నిరసన తెలుపుతున్న కమ్యూనిటీ ఆరోగ్య అధికారులు. సిహెచ్‌ఒ

'ఆదర్శ'లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - రుద్రవరం : రుద్రవరం ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి పాసైన విద్యార్థులందరూ ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చు అని అన్నారు. దూర ప్రాంతాల విద్యార్థినిలకు హాస్టల్ సదుపాయం కూడా కలదు. ఓసి, బిసి అభ్యర్థులు రూ.200 , ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.150 ఆన్లైన్లో చెల్లించి, దరఖాస్తు చేయాలన్నారు. వివరాలకు 9849215838, 9052577016 నంబర్లు సంప్రదించాలని సూచించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - బనగానపల్లె : విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ హెచ్‌ఎం శ్రీరాములు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని గ్రంథాలయంలో సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాం గ్రంథాలయ అధికారి బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ పిల్లలు క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే దేనినైనా సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రియదర్శిని స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు, బిడిసి ఆర్గనైజర్లు రామాంజనేయులు, జీవి. శివరామిరెడ్డి పాల్గొన్నారు. **నంద్యాల :** నంద్యాలోని పింగళి సూరన స్మారక శాఖా గ్రంథాలయంలో బుధవారం ఉచిత వేసవి శిక్షణ తరగతులలో భాగంగా విద్యార్థులకు దినపత్రికలు చదివించడం, కథలు చదివి వినిపించడం, ఆ కథలలో ఉన్న నీతిని వివరించినట్లు రికార్డ్ అసిస్టెంట్ ఆర్.ఈ.శ్రీధర్ తెలిపారు. అలాగే చెస్ (చదరంగం) ఆటల పోటీలను నిర్వహించి వాటిలో ఆట గెలుపునకు తోడ్పడే ప్రాథమిక మెలుకువలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద ఉపాధ్యాయులుగా రిటైర్డ్ లైబ్రరీన్ ఎంసీవీ.సుబ్బారావు, అసిస్టెంట్ టీచర్ డి.ముని స్వామి, ప్రైవేట్ టీచర్ పి. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాలు పండించాలి : డిపిఎం

ప్రజాశక్తి - గోస్పాడు : ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాలను పండించాలని డిపిఎం జి.నరేంద్ర రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని దీబగుంట్ల రైతు సేవ కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంతో రైతు రాముడు పండించిన నవధాన్యాల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి ఆయుష్షును, ఆరోగ్యాన్ని పెంచుకోవాలంటే ప్రకృతి వ్యవసాయంతో పండించిన ధాన్యాన్ని మాత్రమే తినాలని, ప్రతి పల్లెకు ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింప చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ జిల్లా ప్రాజెక్టు అధికారి అబ్దుల్ సలాం, ఎన్ఎఫ్ఏ కరీం భాష, ఏవో, బి.రాముడు, ఎన్ఎఫ్ఎస్ డిఏలు అరుణ, మల్లేశ్వరి, ఎల్‌టులు, ఐసిఆర్‌పిలు, రైతులు పాల్గొన్నారు.

తండావాసుల సమస్యలు పరిష్కరిస్తా : ఎంపీ

ప్రజాశక్తి - అవుకు : తండావాసుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి తెలిపారు. బుధవారం అవుకు మండలంలోని కొండమనాయన పల్లె తండాలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పర్యటించారు. తండాలోని సమస్యలను మహిళలను అడిగి తెలుసు కున్నారు. అనంతరం తండాలో జరుగుతున్న రాయలసీమ ఉద్యమ నేత సీమ కృష్ణ రాథోడ్ తమ్ముడు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. తిరుగు ప్రయాణంలో ఆమె అవుకు రిజర్వాయర్‌ను పరిశీలించి అధికారులతో స్థితిగతులను తెలుసుకున్నారు. టిడిపి నాయకులు ఆకుల నాగిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత షటిల్ బ్యాట్మింటన్ సమ్మర్ క్యాంప్

• డోన్ మున్సిపల్ చైర్మన్ సప్త శైల రాజేష్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తసైల రాజేష్

ప్రజాశక్తి - ప్యాపిలి

డోన్ పట్టణంలోని బుగ్గన శేషారెడ్డి మెమోరియల్ ఇండోర్ స్టేడియంలో ఉచిత షటిల్ బ్యాట్మింటన్ సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు డోన్ మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ పేర్కొన్నారు. ఆసక్తి గల 10-15ఏళ్ల బాల బాలికలు ఉచిత సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇండోర్ స్టేడియంలో బుధవారం ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా ఉచితంగా ఇండోర్ స్టేడియంలో సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమయం ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు ఇండోర్ స్టేడియంలో కౌన్సిలర్ నాగేంద్ర ఫోన్ నెం. 8985702633 సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ నాగేంద్ర, షటిల్ బ్యాట్మింటన్ ప్లేయర్స్ పాల్గొన్నారు.

అనుమతి ఉన్న విత్తనాలు విక్రయించాలి



ప్రజాశక్తి - కొత్తపల్లి : గ్రామాల్లో ఉన్న విత్తనాల, పురుగుల మందుల, ఎరువుల డీలర్లు అనుమతి ఉన్న విత్తనాలను విక్రయించాలని ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు బి. ఆంజనేయ తెలిపారు. కొత్తపల్లి మండలంలోని విత్తన, పురుగు మందుల ఎరువుల డీలర్లకు ఎఒ మహేష్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న డీలర్లు అందరూ అనుమతి లేని విత్తనాలు విక్రయించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చట్ట పరమైన చర్యలు తప్పన్నారు. ప్రతి డీలరు బిల్లు, స్టాక్, రిజిస్టర్ల నిర్వహణ గురించి ముందుగానే అవగాహన కలిగి ఉండాలన్నారు. విత్తనాల రాక గురించి ఎప్పటి కప్పుడు రైతులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో వ్యవసాయ ఎఇఒ నాగశ్రీ, ఎంపిఇఒ వాజీద్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డు తప్పనిసరి

ప్రజాశక్తి - ఆత్మకూర్

కౌలు రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పొందాలంటే తప్పనిసరిగా కౌలు రైతు గుర్తింపు కార్డులు ఉండాలని ఎఒ విష్ణువర్ధన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లోని కౌలు రైతులు తమ గ్రామ పరిధిలోని గ్రామ రైతు కేంద్రాల్లో గుర్తింపు కార్డులు పొందేందుకు అవసరమైన దరఖాస్తులను అందజేసి గుర్తింపు కార్డులు తీసుకోవాలన్నారు. 2025-26 సంవత్సరానికి సంబంధించిన గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకొని కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందాలని ఆయన సూచించారు.

ఘనంగా శ్రీశ్రీ జయంతి



శ్రీశ్రీ చిత్ర పటానికి నివాళ్లర్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ప్యాపిలి : డోన్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాతపేట ప్రధానోపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన అభ్యుదయ కవి శ్రీరంగం శ్రీనివాసరావు(శ్రీశ్రీ) జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీశ్రీ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళ్లర్పించారు. తెలుగు ఉపాధ్యాయులు దేవేంద్రప్ప మాట్లాడుతూ 1910 ఏప్రిల్ 30న పూడిపెద్ది వెంకట రమణయ్య, అప్పలకొండ దంపతులకు శ్రీశ్రీ జన్మించారని తెలిపారు. 1950లో మహా ప్రస్థానం ద్వారా 'మరో ప్రపంచం.. మరో ప్రపంచం.. మరో ప్రపంచం పిలిచింది, పదండి ముందుకు, పదండి తోసుకు! పోదాం, పోదాం పైపైకి! పదండి ముందుకు పదండి' అని ఉవ్వెత్తున లేచి గర్జించారని కొనియాడారు. 'కుదిరితే పరిగెత్తు లేకపోతే నడువు, అదీ చేతకాకపోతే పాకుతూపోగాని ఒకే చోట కదలకుండా ఉండిపోకు' అన్నారన్నారు. అల్లూరి సీతారామరాజు సినిమాకు ఆయన రాసిన 'తెలుగు వీర లేవరా' అనేది శ్రీశ్రీ రాసిన ఆణిముత్యాల్లో ఒకటన్నారు. శ్రీశ్రీకి కేంద్రం సాహిత్య అకాడమీ వార్డు అందజేసిందన్నారు. కొంత కాలం క్యాన్సరు వ్యాధికి లోనై 1983 జూన్ 15న శ్రీశ్రీ మరణించారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు సుభాన్ బాషా, రవీంద్రనాథ్ శర్మ పాల్గొన్నారు.

'మేడే' వేడుకలకు సిద్ధం

ప్రజాశక్తి - ఆత్మకూరు : ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వేడుకలకు ఆత్మకూరు పట్టణంలోని కార్మికులు సిద్ధమయ్యారు. మే ఒకటిన జరగనున్న వేడుకలకు ఆత్మకూరు పట్టణంలోని 20 ప్రాంతాల్లో సిఐటియు జెండాలు ఎగరవేసేందుకు నాయకులు సిద్ధమయ్యారు. ఆయా సెంటర్లలో అరుణ తోరణాలను బుధవారం రాత్రే ఏర్పాట్లు చేశారు.

గ్రంథాలయంలో వేసవి పునశ్చరణ



ప్రజాశక్తి - పగిడ్యాల : పగిడ్యాల గ్రంథాలయంలో వేసవి పునశ్చరణను నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ కె. మద్దమ్మ బుధవారం తెలిపారు. విద్యార్థులచే పంచతంత్ర కథలు చదివించినట్లు చెప్పారు. పంచతంత్ర కథల్లోని మూడు చేపల కథ చదివి కథ గురించి అందులోని నీతిని గ్రంథాలయ అధికారి మద్దమ్మ విద్యార్థులకు వివరించారు. లెక్కల్లోని భిన్నాలు ఎన్ని రకాలు, ఒక భిన్నం నుంచి మరో భిన్నంలోకి ఎలా వెళ్లాలని విద్యార్థులకు కె. సాయి కిషోర్ బాబు వివరించారు. లెక్కల సందేహాలను విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్యారమ్స్, క్రికెట్ ఆటలు ఆడుకున్నారు. పునశ్చరణలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం నాయకున్ని పరామర్శించిన ఎమ్మెల్యే



ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : మండలం కొణిదెల గ్రామానికి చెందిన సిపిఎం నాయకుడు రాజు ప్రమాదవశాత్తు గాయపడ్డారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు, నాయకులు ఫకీర్ సాహెబ్, గోపాలకృష్ణ కొణిదెల గ్రామానికి చేరుకుని అక్కడ నుండీ రాజును నందికొట్కూరు ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స చేయించి అనంతరం కొణిదెల గ్రామానికి చేర్చారు. బుధవారం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య కొణిదెల గ్రామంలో సీపీఎం నాయకుడు రాజును పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట కొణిదెల సర్పంచి నవీన్, పలుచని మహేశ్వర్ రెడ్డి, గ్రామ నాయకులు తదితరులు ఉన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం

- ప్రజాశక్తి కథనానికి స్పందన



బోర్‌కు మరమ్మతు చేయిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ, సర్పంచి

ప్రజాశక్తి - కొత్తపల్లి

కపిలేశ్వరంలో నీటి ఎద్దడి సమస్య పరిష్కరించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ మహమ్మద్ జుబేర్, సర్పంచి బాల ఎల్లయ్యలు తెలిపారు. 'ప్రజాశక్తి' పత్రికలో 'కపిలేశ్వరంలో నీటి ఎద్దడి, గుక్కెడు నీటి కోసం అష్ట కష్టాలు, చెంత కృష్ణమ్మ ఉన్న తాగునీరు కరువు' అనే శీర్షిక ఈ నెల 29న మంగళవారం వెలువడింది. అయితే స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ మహమ్మద్ జుబేర్, సర్పంచి బాల ఎల్లయ్య బుధవారం నీటి ఎద్దడికి పరిష్కారం చేశారు. వారు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కపిలేశ్వరం గ్రామంలో నెలకొన్న నీటి ఎద్దడికి బోర్ మరమ్మతులు చేయించినట్లు చెప్పారు. అలాగే కొత్త మోటర్ వేసి నీటి సమస్య లేకుండా పరిష్కారం చూపామన్నారు. కొన్ని రోజుల నుంచి నీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలు, గ్రామస్తులు నీటి సమస్య పరిష్కారం కావడంతో సంతోషం వ్యక్తపరిచారు.

మెగా జాబ్‌మేళాకు 16 మంది ఎంపిక



జాబ్ మేళాలో పాల్గొన్న అభ్యర్థులు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైల మండలం సున్నిపెంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ పి.హుస్సేన్ బాష అధ్యక్షతన బుధవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. దీనిలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, శ్రీరామ్ ఫైనాన్స్, శ్రీరామ్ చిట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. జాబ్ మేళాకు 30 మంది అభ్యర్థులు పాల్గొనగా వారిలో 16 మంది అభ్యర్థులను ఎంపిక చేసి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. బుచ్చయ్య, ప్లేస్మెంట్ ఆఫీసర్ పూర్ణేశ్వర్ రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ రాజన్న, మహేశ్వర్ రెడ్డి, బాలు, ప్రియదర్శిని, శ్రీరామ్ చిట్స్, ఇన్స్యూరెన్స్ మేనేజర్లు నవీన్, రాములు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో సుంకుల పరమేశ్వరి, ఎల్లమ్మ, సవారమ్మ విగ్రహాల ప్రతిష్టను బుధవారం వైభవంగా నిర్వహించారు. దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఎమ్మెల్యే గిత్త జయసూర్య, నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్‌ఛార్జీ మాండ్ర శివానందరెడ్డిలు విగ్రహ ప్రతిష్టలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


మానవహారంతో రాస్తారోకో నిర్వహిస్తున్న జెఎసి నాయకులు


సిఐలు రాము,సురేష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు

వక్ఫ్ బిల్లు ముసుగులో మతాల మధ్య చిచ్చు

- ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్
- కొత్త చట్టాలతో రైతులకు, ప్రజలకు అన్యాయం
- సయ్యద్ సిద్దిఖ్ అహ్మద్ అడ్వకేట్

ప్రజాశక్తి - వెలుగోడు

వెలుగోడు పట్టణ జెఎసి ముస్లిం మైనారిటీ సోదరులు వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అరుగుల వద్ద ఉన్న మార్కజ్ మసీదు నుండి జిల్లా పరిషత్ హైస్కూల్ మీదుగా మదీనా మసీదు సెంటర్ వరకు కొనసాగింది. అనంతరం మానవహారంతో రాస్తారోకో నిర్వహించారు. ముందుగా ఇటీవల కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ. రాజశేఖర్ మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం వక్ఫ్ బిల్లు ముసుగులో మతాల మధ్య చిచ్చు రేపుతుందన్నారు. వక్ఫ్ బిల్లు పేరుతో నిరసనలు చేస్తే జైలు శిక్ష ఖాయామని హెచ్చరించినా భయపడేది లేదన్నారు. అడ్వకేట్ సయ్యద్ సిద్దిఖ్ అహ్మద్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు ప్రతి బిల్లు అమెండ్మెంట్‌కి సలహాదారులుగా న్యాయవాదులను తీసుకునే వారన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు ఆ వైఖరి చూపడం లేదని విమర్శించారు. రౌడీలు, గుండాలు, వ్యాపారస్తులు రాజకీయ నాయకులుగా రాజ్య మేలుతున్నారని మండిపడ్డారు. వీరంతా కలిసి చట్టసభల్లో ధనికులకు మేలు చేసే చట్టాలను తీసుకొస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు, రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. జెఎసి కన్వీనర్ మౌలానా జవాద్ అహ్మద్ మాట్లాడుతూ వక్ఫ్ అంటే వివిధ రకాల దానం చేసిన సొమ్ము అన్నారు. ఒక్కొక్కరు ఒక్కొక్క సమయంలో ఒక్కొక్క రకంగా దానం ఇచ్చుకుంటూ వస్తున్న ఆస్థి వక్ఫ్ అన్నారు. అటువంటి ఆస్థిపై ప్రభుత్వాలు ఇబ్బంది పెట్టడం సరైన పద్ధతి కాదని ఆయన హెచ్చరించారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి చేరుకొని వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షులు మోమిన్ రసూల్, కో-కన్వీనర్స్ ముల్లా షబ్బీర్ అహ్మద్, హిదాయత్ అలి ఖాన్, ఇలియాస్ ఖాన్, టైలర్ సయ్యద్, మొహమ్మద్ రఫీ, హఫీజ్ షఫీ, హుస్సేన్, ఖాదర్ వలీ, మౌలానా జాకీర్, ఆత్మకూరు పట్టణ సిఐ రాము, రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డి, వెలుగోడు ఎఎస్ఐ షాషావలి, ఎఎస్ఐ హుస్సేన్ పాల్గొన్నారు.

కొర్ర రైతులను ఆదుకోవాలి : ఎపి రైతు సంఘం


మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు ఎ. రాజశేఖర్, లంక సుబ్బారాయుడు

ప్రజాశక్తి - బేతంచెర్ల

కొర్ర పంటకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు లంక సుబ్బరాయుడు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని ఆర్ఎస్ రంగాపురం, అంబాపురం గ్రామాల్లో రైతు సంఘం మండల కార్యదర్శి పి రామ్మోహన్, కృష్ణన్న ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు సుమారుగా 5 వందల ఎకరాల్లో కొర్ర పంట సాగు చేశారని తెలిపారు. అలాగే కొర్ర పంట కోతలు మొదలయ్యాయని, అయితే గతేడాది కొర్రలు క్వింటాలు రూ. 7వేల ప్రకారం విక్రయించినట్లు తెలిపారు. ప్రస్తుతం క్వింటం రూ. 2,500 నుండి రూ. 2,700లకు వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారన్నారు. రైతులు అధిక పెట్టుబడులు పెట్టి సాగు చేశారని, పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన గిట్టుబాటు ధరతో కొర్రను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. అనంతరం రైతు సంఘం రంగాపురం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షులుగా నీలి రాంబాబు, కార్యదర్శిగా పసుపుల మధుసూదన్, ఉపాధ్యక్షులుగా యామసాని ఈశ్వర్ రెడ్డి, పి. నారాయణరెడ్డి, కార్యదర్శులుగా జలాల్ మహమ్మద్ రఫీ, టి. మద్దిలేటిస్వామి, గోరుకల్లు బాష, కమిటీ సభ్యులుగా వడ్ల ఖాదర్ బాషా, వై. మనోహర్, బి. వెంకటసుబ్బయ్య, పి. రంగారెడ్డి, వై. మహమ్మద్, యు. శేఖర్, జికె. మధు, పి. నబీ రసూల్, మద్దిలేటిస్వామి తదితరులను రైతుల సమక్షంలో ఎన్నుకున్నారు.

20లీటర్ల నాటుసారా స్వాధీనం : ఎక్సైజ్ సిఐ


నాటుసారాను స్వాధీనం చేసుకున్న దృశ్యం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్ : పట్టణంలోని నీలి షికారి పేటలో ఎక్సైజ్ శాఖ పోలీసులు బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సిఐ రామాంజనేయులు తెలిపారు. దాడుల్లో సబ్జాని అనే వ్యక్తి మోపెడ్ మీద తరలిస్తున్న 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడులోల ఎస్సైలు జఫరుల్లా, భాష్యం శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ కృపవర కుమారి, శంకర్ నాయక్, కానిస్టేబుల్ శివన్న, మధుసూదన్ ప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్ షర్మిలను హౌస్ అరెస్టు చేయడం దుర్మార్గం

ప్రజాశక్తి - కొత్తపల్లి



కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను హౌస్ అరెస్ట్ చేయడం దుర్మార్గమని నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు ఎం.పి మద్దిలేటి బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. వైఎస్ షర్మిల ఇంటి నుండి పార్టీ కార్యాలయానికి వెళ్తున్న సమయంలో పోలీసులు అడ్డుకోవడం బాధాకరమన్నారు. రాజధాని ప్రాంతం విజయవాడలోనే ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం ప్రభుత్వ పిరికితనానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో సమస్యల మీద మాట్లాడే వ్యక్తులపై హౌస్ అరెస్టులు నిర్బంధాలు చేయడం సరైంది కాదన్నారు. ఇలాగే చేస్తే జగన్ ప్రభుత్వానికి పట్టిన గతే చంద్రబాబు ప్రభుత్వానికి పట్టడం ఖాయమన్నారు. మనం భారతదేశంలో ఉన్నామా పాకిస్తాన్లో ఉన్నామా అని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిర్బంధాలు, హౌస్ అరెస్టులు మానుకోవాలన్నారు.

ఉరేసుకుని విఒఎ ఆత్మహత్య

- సంతాపం తెలిపిన సిఐటియు నాయకులు



ప్రజాశక్తి - బేతంచెర్ల

మండల పరిధిలోని బుగ్గానిపల్లి గ్రామం విఒఎ (సిఐటియు అనుబంధం) జింక సుధాకర్(36) కుటుంబ కలహాలతో మంగళవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు జింక సుధాకర్ పదేళ్లుగా బుగ్గానిపల్లి గ్రామంలో బుక్ కీపర్‌గా పని చేస్తూ అందరి మన్ననలు పొందుతూ అందరికి సుపరిచితుడన్నారు. భార్య ఈ మధ్య కాలంలో పురుడు పోసుకోవడానికి మండలంలోని సీతారామపురం గ్రామానికి వెళ్ళింది. పాపపుట్టి నాలుగు నెలలు పూర్తి కావస్తుంది. అయితే మృతుడు సుధాకర్ భార్య పుట్టిల్లు ఆయన సీతారామరానికి వెళ్లి భార్యను పిల్లల్ని చూసి రాత్రి బుగ్గానిపల్లికి చేరుకున్నాడు. రాత్రి కావడంతో కుటుంబ సభ్యులు, తల్లి బంధువులు ఎవరికి వారు మిద్దెపైన నిద్రపోతుండగా సుధాకర్ ఇంట్లోకి వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్లవారిసరికి కొడుకు సుధాకర్ ఉరేసుకోవడం చూసి తల్లి బంధువులు ఒక్కసారిగా దుఃఖ సాగరంలో మునిగిపోయారు. మృతుడు సుధాకర్‌కి భార్య రజిని, ఐదేళ్ల కొడుకు, నాలుగు నెలల కూతురు ఉన్నారు. విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా మండల నాయకత్వం మృతుని గ్రామానికి చేరుకొని భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి కుటుంబానికి సంతాపం తెలిపారు. మృతుడు సుధాకర్‌కు చిన్నపిల్లలు భార్య ఉండడంతో విఒఎలకు ప్రభుత్వం భీమా సౌకర్యం కల్పించి కుటుంబాలను ఆదుకోవాలని సిఐటియు నాయకులు కోరారు. నివాళ్లర్పించిన వారిలో సిఐటి జిల్లా ఉపాధ్యక్షుడు వై ఎల్లయ్య, వైబి వెంకటేశ్వర్లు, సిపిఎం మండల కార్యదర్శి మధు శేఖర్, సిఐటియు పట్టణ కార్యదర్శి సంజీవ నాయుడు, నాయకులు వేణుగోపాల్, శ్రీనివాసులు, సిమెంటు నగర్ జలంధర్, రాజబాబు, అంకాలు, నరసింహ టింగు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పాములపాడు

పాముల పాడు మండలంలోని బానకచర్ల, చెలిమిళ్ళ, పాములపాడు, జూటూరు గ్రామాల్లో లేఅవుట్ వేసిన గృహ లబ్ధిదారులు, ఆర్ఎల్ఆర్‌సి స్టేజి లబ్ధిదారులకు బుధవారం మోటివేషన్ కల్పించినట్లు స్పెషల్ ఆఫీసర్ రాజు, ఎంపిడిఒ చంద్రశేఖర్ తెలిపారు. గృహ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా రూ. 50వేల ఇవ్వడం జరుగుతుందన్నారు. గృహాలను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం : సిఐ

ప్రజాశక్తి - పాణ్యం : పాణ్యం మండలంలో అసాంఘిక కార్యకలాపాలు జరిగిన సామాన్య ప్రజలకు శాంతి భద్రత విషయంలో విఘాతం కలిగించినా ఉక్కుపాదం మోపుతామని పాణ్యం సిఐ కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సుగాలిమిట్ట గ్రామంలో బుధవారం నిర్వహించిన కార్డెన్ అండ్ సెర్చ్‌లో భాగంగా బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్తులను ఉద్దేశించి సిఐ మాట్లాడుతూ గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని నిర్వాహకులను హెచ్చరించారు. పరిమితికి మించి ఆటోలలో తరలుతున్న వ్యవసాయ కార్మికులకు, ఆటో డ్రైవర్లకు పాణ్యం ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి, సిఐ కిరణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. అనుకోకుండా జరిగే ప్రమాదాలు జరిగే ఎవరు బాధ్యత వహిస్తారని ఆటో డ్రైవర్లను ప్రశ్నించారు. డ్రైవర్లందరూ తప్పనిసరిగా రవాణా నియమాలు పాటించాలని చెప్పారు. మండలంలో ఎవరైనా బెల్ట్ షాపు నిర్వహించినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రశాంతంగా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, సుమీద ఇంగ్లీష్ మీడియం స్కూల్, సెంటెన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, రీడ్ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ శైలేంద్ర కుమార్ పేర్కొన్నారు. పరీక్షకు 79 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. అయితే 910 విద్యార్థులు పాలిటెక్నిక్ పరీక్షకు అప్లై చేయగా 799 మంది మాత్రమే హాజరయ్యారని, 111 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ప్రవేశ పరీక్షలను బేతంచర్ల మండలం డిప్యూటీ తహశీల్దార్ మారుతి తనిఖీ చేసినట్లు తెలిపారు.



ప్రజాశక్తి - ఆదోని

సమాజ మార్పు కోసం యువతను మేలుకొలిపే దిశగా డివైఎఫ్ఐ కృషి చేస్తుందని ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు వీరేష్, నాయకులు సతీష్ వెంకటేష్ తెలిపారు యువత మార్పు

మండే ఎండల్లోనూ.. డివైఎఫ్ఐ సైకిల్ యాత్ర

కోసం యువ సైకిల్ యాత్ర మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. డివైఎఫ్ఐ యువ సైకిల్ యాత్ర రెండవ రోజు కొత్త బస్టాండ్ ఆవరణం, మండగిరి, ఎస్ కే డి కాలనీ, క్రాంతి నగర్, తిమ్మారెడ్డి బస్టాండ్ సైకిల్ యాత్ర నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడారు యువత అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. ప్రభుత్వ శాఖల్లోనే ఖాళీలను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేయడంతో నిరుద్యోగ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధి కోసం సుదూర ప్రాంతాలకు హక్కుల సాధనకై యువత ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. గంజాయి డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకుందామన్నారు. యువత భవిష్యత్తుకు బంగారు బాటలు వేద్దామన్నారు చెడు వ్యసనలకు బానిస కాకుండా దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు మోహన్, నవీన్, వీరబాబు వున్నారు.

భూసమస్యలను సామరస్యంగా పరిష్కరించాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - గోనెగండ్ల

రీ సర్వే భూ సమస్యలను ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా రైతుల సమక్షంలో సామరస్యంతో వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. గోనెగండ్లలోని రైతు సేవా కేంద్రంలో రీ సర్వే కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న గ్రౌండ్ వ్యాలిడేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు భూమి కొలతలు విస్తీర్ణంలో తేడాల సమస్యను ఆయన దృష్టికి తీసుకొని వచ్చారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆ సర్వే నెంబర్‌లో ఉన్న రైతులందరి సమక్షంలోనే రెవెన్యూ సిబ్బంది సమస్యను పరిష్కరిస్తారని అన్నారు.

గాజులదిన్నె ప్రాజెక్ట్ అధికారులతో సమావేశం

గాజులదిన్నె ప్రాజెక్టుకు సంబంధించిన భూములపైన ప్రాజెక్టు ఈఈ పాండురంగయ్య, డిఈ విజయ్ కుమార్‌లతో సమావేశం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మునక భూముల సర్వే రిపోర్టులను వీలైనంత త్వరగా అందజేయాలని వారు ఈ సందర్భంగా సబ్ కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో తహసిల్దార్ కుమారస్వామి ఎల్ఎల్సీ జిడిపి ఏఈలు ఉదయభాస్కర్, చిన్న అలీ, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాసరాజు, రీ సర్వే డిటి శిరీష, ఆర్ఐ జగన్నాథ రావు పాల్గొన్నారు.


శ్రీశ్రీ జయంతి సభలో స్వరూప్‌సిన్హా, ప్రతాప్‌రెడ్డి, పద్మావతి

మున్సిపల్ చైర్మన్‌కు స్నేహితుల సన్మానం

ప్రజాశక్తి- ఆదోని


ఆదోని మున్సిపల్ చైర్మన్ ను సన్మానించిన స్నేహితులు

ఆదోని మున్సిపల్ చైర్మన్ గా ఎంఎం జి గౌస్ బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆయన చిన్ననాటి స్నేహితులు కలిసి ప్రత్యేకంగా సన్మానించారు. బుధవారం మున్సిపల్ చైర్మన్ ఛాంబర్‌లో ఎం ఎం జి గౌస్ ఆయన చిన్ననాటి స్నేహితులు జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెఎం ముజీబ్ అహ్మద్ ఆధ్వర్యంలో చిన్ననాటి స్నేహితులు ఎక్బాల్ , గాజుల రాజశేఖర్ లు ప్రత్యేకంగా అభినందించారు. తమ స్నేహితుడు ఆదోని మున్సిపాలిటీకి చైర్మన్ కావడం తనకు ఎంతో గర్వకారణంగా ఉందని ముజీబ్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా వారు చిన్ననాటి తమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ ఎం ఎంజి గౌస్ తో పాటు జనసేన పార్టీ ఇంచార్జి మల్లప్ప , టిడిపి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి మరి కొంతమంది ఒక బ్యాచ్‌గా ఉండి అప్పట్లో క్రికెట్ ఆడేవారమని గుర్తు చేశారు. ఆదోనిలోతొలిసారిగా బడుగు వర్గాల తర్వాత బలహీనవర్గాలుగా తామే క్రికెట్లో పాల్గొన్నామని చైర్మన్ గౌస్‌గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బసాపురం వినోద్ రెడ్డి , శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థ అధినేతకు పింఛన్

-ప్రభుత్వం మారినా ఐదేళ్ల నుంచి ఇప్పటికి కొనసాగుతున్న పింఛన్

-లబ్ధిదారునికి రూ.10 వేలకు పంపిణీ చేసిన ఉద్యోగికి రూ 2 వేలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

వడ్డించేవాడు మనవాడు అయితే పంక్తి భోజనంలో ఏ మూలన కూర్చున్నా కావలసిన ఆహార పదార్థాలు అన్నీ వడ్డిస్తాడు అనేది సామెత. ఈ సామెతను నిజం చేస్తూ కర్నూలు జిల్లా కల్లూరు మండలం సల్కాపురం గ్రామంలో వైసిపి నాయకులు నిజం చేశారు. వైసిపి ప్రభుత్వ పాలనలో 2020 సంవత్సరం జనవరి లో రామాపురం మధుసూదన్ రెడ్డి అనే వ్యక్తికి పెరాలసిస్ వ్యాధి వచ్చి వీల్ చైర్ కు అంకితమై జీవనం సాగిస్తున్నాడు అన్న దరఖాస్తు రావడంతో ప్రభుత్వ అధికారులు రూ 10,000 పింఛన్ మంజూరు చేశారు. అప్పటినుంచి రూ పదివేల పింఛన్ తీసుకుని లబ్ధిదారుడు జీవనం చేస్తున్నాడు. కల్లూరు ఎంపిపి బోయ శారద స్వగ్రామం కూడా సల్కాపురం గ్రామమే. అయితే రామాపురం మధుసూదన్ రెడ్డి సల్కాపురం గ్రామంలో కాపురం లేదని గ్రామస్తుల నుంచి సమాచారం. అతనికి కల్లూరు అర్బన్ పాత కల్లూరులో ప్రతిభ ఇంగ్లీష్ మీడియం స్కూల్ (1 నుంచి 10 వ తరగతి వరకు) ను గత కొన్ని సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్నాడు. ప్రైవేట్ పాఠశాల యజమాని అయిన రామాపురం మున్సిపల్ రెడ్డికి సల్కాపురం గ్రామంలో పింఛన్ మంజూరు చేయడం పట్ల పలు ఆరోపణలు వెల్లువతాయి. అతను వైసిపి అభిమాని కావడంతో అధికారులు పింఛన్ మంజూరు చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రూ 10 వేలు ఫించన్ తీసుకుని పంపిణీ చేయడానికి వచ్చిన అధికారికి రూ 2వేలు ఇచ్చి పంపుతున్నాడు. దీనిపై స్థానిక టిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గ్రీవెన్స్ లో ఫించన్ నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఇటీవల జిల్లా కలెక్టర్ కు అర్జీ ఇచ్చారు. మే,1 వ తేదీ నుంచి పంపిణీ చేసే అధికారులు రామాపురం మధుసూదన్‌రెడ్డికి పింఛన్ ఇస్తారా? ఇవ్వరా? వేచిచూడాల్సిందే.

8న జాబ్ మేళా

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు


జాబ్ మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బివి

నిరుద్యోగ సమస్య నిర్మూలించడమే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ బివి జయ నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ బివి జయ నాగేశ్వర్ రెడ్డి నాయకత్వంలో ఈ నెల 8న ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేక ఉద్యోగ మేళా గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బివి మాట్లాడుతూ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ఉద్యోగ మేళాలో 13కు పైగా బహుళజాతీయ కంపెనీలు పాల్గొననున్నాయి.అభ్యర్థులు ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా, బిటెక్ ఎంబి వంటి అర్హతలు కలిగి ఉండాలి. 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఫ్రెషర్స్‌తో పాటు అనుభవం కలిగిన అభ్యర్థులు కూడా హాజరు కావచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.12,000 నుండి రూ.24,000 వరకు వేతనం, ఇతర అల వెన్సులు లభించనున్నాయి. అభ్యర్థులు తమ బయోడేటా, అభ్యాస సంబంధిత సర్టిఫికెట్లు అవసరమైన ఇతర డాక్యు మెంట్స్‌తో పాటు ఈనెల 8న నేరుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 7799494856, 9642735717, 8885904099 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్య క్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎల్. ఆనంద్ రాజ్ కుమార్ , ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, పి.ప్రసాద్ ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ సాయి తేజ , నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాల నిధుల ఖర్చుపై నాణ్యత పర్యవేక్షకుల తనిఖీ

ప్రజాశక్తి - బెళగల్



2019 – 2020 లో పుష్కరాలకు వచ్చే భక్తుల సౌకర్యాల కల్పనలో భాగంగా నిధుల ఖర్చుపై నాణ్యత పర్యవేక్షణ బృందం బుధవారం క్షేత్ర స్థాయిలో తనిఖీ చేపట్టారు. కర్నూలు నుండి గుండ్రేవుల వరకు బిటి రోడ్డు,పుష్కర ఘాట్లు వంటివి నది తీరం వెంట ప్లాన్ వర్క్ నిధులు రూ.32 కోట్లు ప్రభుత్వం వెచ్చించి నిర్మించింది. బిటి రోడ్డు సుమారు 13.5 కిలోమీటర్ల మేర కాంట్రాక్టర్ బాలరామి పనులు చేపట్టారు. బుధవారం ఎస్ఇ జి చంద్రశేఖర్, ఇఇ కృష్ణా రెడ్డి, డిఇ వెంకటేశ్వర రెడ్డి, జెఇలు సోమశేఖర్, రమణ లు ఆర్ అండ్ బి శాఖ నుండి ఇఇ సురేష్ బాబు,డిఇ లు నాగరాజు, రవిచంద్రలు, అప్పటి ఎఇ భార్గవ్, ప్రస్తుత ఎఇ ఫయాజ్ లు పాల్గొని ఆరు చోట్ల బిటి రోడ్డుకు రంధ్రాల ద్వారా నాణ్యత యంత్రాల ద్వారా పరిశీలించారు. ప్రస్తుతం నాబార్డు కింద రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. ఈ పుష్కర నిధుల ఖర్చులు ,పుష్కర పనుల మినహా నాబార్డు పనులు నిధులు వినియోగంపై బిల్లులు అంచనా వేయడం జరుగుతుందని ఈ సందర్భంగా పర్యవేక్షణ బృందం తెలిపింది.

అన్ని గ్రామాలకు సాగునీరు అందించాలి

- ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

ప్రజాశక్తి - దేవనకొండ



హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలోని అన్ని గ్రామాలకు సాగునీరు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోటకొండ సూరి డిమాండ్ చేశారు. బుధవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో బండపల్లి గ్రామంలో రైతులతో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హంద్రీనీవా ప్రధాన కాలువకు గుండ్లకొండ దగ్గర స్లూయిజ్ ఏర్పాటు చేసి గుండ్లకొండ, గుడిమిరాళ్ల, బంటుపల్లి, చెల్లెలిచిలిమల, బేతపల్లి, బండపల్లి, కోటకొండ పొలాలకు సాగునీరు అందించాలన్నారు. అదేవిధంగా గుండ్లకొండ భానుకుంట చెరువు, గుడిమరాళ్ల తుమ్మల, నిమ్మల బండ, బంటుపల్లి అనుకుంట చెరువు, చెల్లెల చెలిమెల, బండపల్లి, కోటకొండ చిన్నోని చెరువు,మాచాపురం పెద్ద చెరువులకు హంద్రీనీవా ద్వారా నీటిని నింపాలన్నారు. రాజకీయాలకు అతీతంగా రైతులందరినీ ఐక్యం చేసి పోరాడాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. సంతకాల సేకరణ ఉద్యమం ప్రారంభం మాత్రమే అని రాబోయే కాలంలో సాగునీరు సాధించుకోవడం కోసం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కండేయులు, కౌలుట్లయ్య, అస్లాం భాష, శ్రీరాములు, ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ కవిత్వం సరళం, శక్తివంతం

జయంతి సభలో వక్తలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) కవిత్వం ఎంతో సరళంగా, అత్యంత శక్తివంతంగా కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిందని వక్తలు కొనియాడారు. కదిలేది...కదిలించేది... పెనునిద్దుర వదిలించేదిగా సమాజంలో చాలా ప్రభావం చూపిందన్నారు. కర్నూలు ఏ క్యాంప్ మోంటెస్సోరి పాఠశాలలో మహాకవి శ్రీశ్రీ 115వ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. దేవీ ప్రసన్న సాహితీ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ బి.వి.స్వరూప్ సిన్హా అధ్యక్షత వహించగా, తెలుగు కళ్యం వ్యవస్థాపకులు, ఉపాధ్యాయులు డాక్టర్ చిన్నావుల వెంకట రాజా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శ్రీ శ్రీ కవిత్వం నేటి సామాజిక నేపథ్యం గురించి ప్రసంగించారు. కార్యక్రమ ప్రారంభంలో ఇటీవల పహల్‌గాం తీవ్రవాద దాడిలో మరణించిన యాత్రికులకు నిమిషం మౌనం పాటించి సాను భూతి తెలిపారు. ప్రతాపరెడ్డి ఉపన్యాసంతో ప్రారంభమైన సభ, శ్రీ శ్రీ పదబంధ మధురిమను పద్మావతి వివరించారు. శ్రీ శ్రీ కవితా ఝరి ని రాజ శేఖర్ వివరించారు. శ్రీ శ్రీ రచనా విశిష్టత లక్ష్మీ కాంత రెడ్డి, శ్రీశ్రీ సినీ గీత లహరిని డాక్టర్ స్వరూప్ సిన్హా పాడుతూ వివరించారు. కేవలం కవిత్వమే కాకుండా శ్రీశ్రీ నాటకాలు, కథలు, విమర్శలు, పాటలు కూడా రాశారన్నారు. సినిమా పాటల రచయితగా కూడా ఆయన తనదైన ముద్రవేశారని తెలిపారు. నిరంజన్ వందన సమర్పణ చేశారు. అనంతరం ముఖ్య అతిథులకు సన్మానం చేశారు. కార్యక్రమం ఆద్యంతం తెలుగు ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేశారు. ప్రధానోపాధ్యాయులు రమాజ్యోతి, డైరెక్టర్ శ్రీ రాజశేఖర్ పాల్గొన్న వారికి అభినందనలు తెలిపారు.


సమీక్షలో మాట్లాడుతున్న జస్టిస్ బి.లీలా వెంకటశేషాద్రి

హిట్ అండ్ రన్ కేసులపై సమీక్ష

ప్రజాశక్తి-లీగల్ కర్నూలు: జిల్లా జడ్జి , అధ్యక్షులు జి. కబర్ది ఆదేశాలతో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి బుధవారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కర్నూలు , నంద్యాల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా అధికారులు న్యాయ మూర్తికి కర్నూలు జిల్లా నందు 76 , నంద్యాల జిల్లా 38 హిట్ అండ్ రన్ కేసులు ప్రాసెస్ లో ఉన్నాయని తెలిపారు. ఈ కేసులను త్వరిత గతిన పరిష్కరించి బాధితులకు సరైన నష్ట పరిహారం ఇప్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో నంద్యాల జిల్లా రెవెన్యూ ఆఫీసర్ రాము నాయక్, కర్నూలు రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ భారతి చవాన్, కర్నూలు డిస్ట్రిక్ట్ రెవిన్యూ ఆఫీస్ సూపరింటెండెంట్ రాజేశ్వరి, ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్, డిసిఆర్ బి, సిఐ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

హర్షం వ్యక్తం చేసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి -సి బెళగల్ : టిడిపి జిల్లా నాయకులు విష్ణువర్ధన్ రెడ్డిని కెడిసిసిబి చైర్మన్ గా సిఎం చంద్రబాబు నాయుడు నియమించడం హర్షణీయమని మండల టిడిపి నాయకులు ఈరన్న గౌడ్, చికెన్ ఈరన్న, గౌస్ లు పేర్కొన్నారు. బుధవారం సిబెళగల్ అంబేద్కర్ సర్కిల్ లో బాణా సంచా పేల్చి సంబరాలు జరుపుకొన్నారు. ఎన్నో ఏళ్లుగా టిడిపిలో ఉంటూ ప్రజల పక్షాన పోరాడే వ్యక్తిగా విష్ణువర్ధన్ రెడ్డికి ప్రజా దరణ అంచెలంచెలుగా దక్కడం గర్వించదగ్గ విషయమని నాయకులు పేర్కొ న్నారు. చైర్మన్ గా పదవికి న్యాయం చేస్తారని ఆశిస్తున్నామని ఇకపై మండలంలో శాశ్వత అభివృద్ధి పనులపై దృష్టి సారిస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

గ్రామ పంచాయతీ స్థలాల పై రిజిస్ట్రేషన్లు చెల్లవు

గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజు

ప్రజాశక్తి మంత్రాలయం: గ్రామ పంచాయతీ స్థలాలను ఆక్రమించి పట్టాలు పొందినా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నా సరే చెల్లవని గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజు తెలిపారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. గ్రామ పంచాయతీ పరిధిలోని గల సర్వే నెంబర్ 72 /2 బి, 108 /2 108/3 లో మొత్తం 68 సెంట్లు, బృందావనం లేఅవుట్ లో 96 సెంట్లు, గ్రామ పంచాయతీకి చెందినదని తెలిపారు. రూ.కోట్ల విలువ చేసే స్థలాన్ని ఇటీవల సర్వే నెంబరు 108 గల 20 సెంట్లు భూమిని అక్రమంగా అమ్మినట్లు తెలిసిందని, కొన్న వ్యక్తులు అప్రూవల్ కు వచ్చినప్పుడు విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. అ క్రమంగా పట్టాలు పొందినా, రిజిస్ట్రేషన్లు చేయించుకున్నా చెల్లనేరవని తెలిపారు. ప్ర స్తుతం సంబంధిత స్థలాలను స్వాధీనం చేసుకుని సూచించే బోర్డులు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పంచాయతీ పరిధిలో గల స్థలాలను ప్రజా సేవలకు నిర్మించే భవనాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.



వివిఎస్ కుమార్‌ను సన్మానిస్తున్న విసి, రిజిస్ట్రార్

కళాశాల అభివృద్ధికి కృషి

ఇన్చార్జ్ విసి వెంకట బసవరావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సిల్వర్ జూబ్లీ కళాశాల అభివృద్ధికి డాక్టర్ బివి సుబ్రహ్మణ్య కుమార్ ఎన్నో చర్యలు తీసుకున్నారని క్లస్టర్ వర్సిటీ ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు రిజిస్ట్రార్ కట్ట వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం సిల్వర్ జూబ్లీ కళాశాల ఆడిటోరియంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివి.సుబ్రహ్మణ్య కుమార్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. విసి, రిజిస్ట్రార్ మాట్లాడుతూ సిల్వర్ జూబ్లీ కళాశాలకు ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉన్నాయన్నారు. అలాంటి కళాశాలలో ప్రిన్సిపల్‌గా సేవలు అందించిన సుబ్రహ్మణ్య కుమార్‌కు వారు అభినందనలు తెలిపారు. వివిఎస్ కుమార్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయనను ఘనంగా పూలమాలలు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పర్మెన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఇందిరా శాంతి, అధ్యాపకురాలు డాక్టర్ అక్తర్ భాను, సమిత బేగం, దండ బోయిన పార్వతి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్ రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఎల సమస్యలను పరిష్కరించాలి

కలెక్టర్‌కు సిఐటియు వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విఆర్ఎలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు, విఆర్ఎల సంఘం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కలెక్టర్ ను వారు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎండి అంజిబాబు, జె.నాగేశ్వరరావు మాట్లాడుతూ విఆర్ఎల సమస్యలను కూటమి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని వారు విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం విఆర్ఎల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు విఆర్ఎలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అటెండర్ల ప్రమోషన్ కోటాను 20శాతం నుండి 70 శాతానికి పెంచాలని కోరారు. అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని అన్నారు. విఆర్ఎలకు వారసత్వ హక్కు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ఎల సంఘం నాయకులు బాష, వెంకటేశ్వర్లు, ధనుంజయ నాయుడు, రవి, తదితరులు పాల్గొన్నారు.

ర్యాంప్ లు ఉండే విధంగా చర్యలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ కార్యాలయాలు అన్నిటిలోనూ ర్యాంప్ లు ఉండే విధంగా చర్యలు చేపడతామని డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి వైకల్య కమిటీ సమావేశాన్ని సంబంధిత అధికారులతో డిఆర్ఒ నిర్వహించారు.

పొలం తగాదాలో వ్యక్తిపై దాడి

ప్రజాశక్తి- నందవరం

నందవరం మండల పరిధి ముగితి గ్రామంలో పొలం తగాదాలో ఘర్షణ జరిగినట్లు ఎస్ఐ కేశవ్ తెలిపారు.ఎస్ తెలిపిన వివరాల మేరకు.. ముగతి గ్రామానికి చెందిన బోయ ఏర్రిస్వామిని అదే గ్రామానికి చెందిన నాగరాజు, ఆయన కొడుకు దస్తగిరి పొలం విషయంలో గొడవపడి రాయితో దాడి చేసినట్లు చెప్పారు. దాడిలో ఎర్రస్వామి గాయపడ్డారని తెలిపారు.ఫిర్యాది ఏర్రిస్వామి రిపోర్ట్ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

బాధితురాలి కుటుంబాన్ని ఆదుకోండి

ప్రజాశక్తి-మద్దికేర

అగ్నిప్రమాదంలో బంకు దగ్ధమైన బాధితురాలు ఆకుల లక్ష్మిని ఆదుకోవాలని యడవలి గ్రామ ప్రజలు మంగళ అధికారులను కోరారు. గత రెండు రోజుల క్రితం వికలాంగురాలైన లక్ష్మి, చిన్న బంకు పెట్టుకుని జీవనం సాగించేది. గత రెండు రోజుల క్రితం అగ్ని ప్రమాదం జరిగి బంకు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో దాదాపుగా రూ.లక్ష 50 వేల ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితురాలు లక్ష్మి తెలిపారు. సర్వం కోల్పోయిన బాధితురాలు లక్ష్మిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరారు.

రవాణా రంగాన్ని కాపాడుకుందాం

- కార్మికుల హక్కుల కోసం పోరాడుదాం!

-తిరోగమన విధానాలకు వ్యతిరేకంగా రోడ్డు రవాణా కార్మికుల గళం విప్పాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

'భారత ప్రభుత్వపు తప్పుడు విధానాల వల్ల రోడ్డు రవాణా సంస్థలు (ఆర్టీసీలు) , ప్రైవేట్ రవాణా సంస్థలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయాయి. ప్రయాణీకుల , సరుకు రవాణా రంగాల మనుగడ ప్రశ్నార్థకమైంది. మే డే స్ఫూర్తితో ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించి, రోడ్డు రవాణా రంగాన్ని, కార్మికుల జీవనోపాధిని కాపాడుకోవాల్సిన తక్షణ అవసరం ఉంది.' అని రాష్ట్ర కోశాధికారి, ఎపిపిటిడిఎస్‌డబ్ల్యుఎఫ్ జె.దివాకర్ అన్నారు. మేడే సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. ఆయన మాటల్లో...

ప్రభుత్వాల నిర్లక్ష్యం, డీజిల్ ధరల పెరుగుదల, అధిక పన్నులు , మోటారు వాహనాల సవరణ చట్టం 2019 వంటి ప్రజావ్యతిరేక విధానాల వల్ల దేశంలోని ఆర్టీసీలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఫలితంగా, ఖాళీలను భర్తీ చేయకపోవడం, ఔట్‌సోర్సింగ్ విధానాలు, జీతాలు ఆలస్యం ఇవ్వడం,ఉద్యోగులకు టెర్మినల్, పెన్షన్ వంటి ప్రయోజనాలు నిలిపివేయడం వంటి చర్యలతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రైవేట్ రవాణా రంగంలోని కార్మికులు నిరంతరం శ్రమ దోపిడీకి గురవుతున్నారు. తీవ్రమైన వాతావరణ పరిస్థితుల్లోనూ ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్నా, వారికి కనీస వేతనాలు, కార్మిక చట్టాల రక్షణ , సామాజిక భద్రత కరువయ్యాయి. పోలీసు అధికారుల వేధింపులు, పెరిగిన జరిమానాలు వారి జీవితాలను మరింత దుర్భరం చేస్తున్నాయి. నిత్యావసర వస్తువుల ధరలు, విద్య , వైద్య ఖర్చులు పెరగడంతో కుటుంబాలను పోషించడం వారికి అత్యంత కష్టతరంగా మారింది.

భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సామాజిక భద్రతా చట్టం వంటి రక్షణ, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన రోడ్డు రవాణా కార్మికులకు జాతీయ స్థాయిలో లేకపోవడం దురదృష్టకరం.మోటారు వాహనాల సవరణ చట్టం 2019లోని కొత్త సెక్షన్ 93 ("అగ్రిగేటర్") చిన్న తరహా వాహన యజమానులను నిర్మూలించి, రవాణా రంగాన్ని పూర్తిగా ఊబర్, ఓల, రాపిడో,పోర్టర్ వంటి బడా కార్పొరేట్ సంస్థలకు అప్పగించే కుట్రపూరితమైన చర్య. ఇది ఆర్‌టిసిలను బలహీనపరచడానికి , లక్షలాది మంది కార్మికుల ఉపాధిని దెబ్బతీయడానికి ఉద్దేశించిన ప్రమాదకరమైన విధానం. ఫ్లెక్స్‌బస్ వంటి అంతర్జాతీయ కంపెనీల రాక ఈ ప్రమాదాన్ని మరింత పెంచుతోంది.

కార్మికుల పాలిట మరణ శాసనంలాంటి ఈ నాలుగు కార్మిక కోడ్‌లను ప్రభుత్వం అమలు చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇవి అమల్లోకి వస్తే, కార్మికులకు కనీస



జె.దివాకర్

రక్షణ కల్పించే 29 కార్మిక చట్టాలు రద్దవుతాయి. యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కు, సమిష్టి బేరసారాల హక్కు , సమ్మె చేసే హక్కు వంటి ప్రాథమిక హక్కులను కార్మికులు కోల్పోతారు.

కార్మిక హక్కులను కాపాడుకోవడానికి, కార్మిక ఉద్యమాలను రక్షించుకోవడానికి , పైన పేర్కొన్న డిమాండ్లను సాధించుకోవడానికి రోడ్డు రవాణా కార్మికులందరూ ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది! రండి, మే డే స్ఫూర్తితో పోరాడుదాం!.

20న దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేద్దాం

-ఎల్ఐసి పరిరక్షణ

- కార్మిక హక్కుల సాధన లక్ష్యం

ప్రజాశక్తి-కర్నూలు

' కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసిని బలహీనపరిచే కుట్రలకు పాల్పడుతోంది. ఐఆర్‌డిఎ దీనికి సహకరిస్తోంది. విదేశీ బీమా కంపెనీలకు తలుపులు తెరుస్తూ, ఎల్ఐసి షేర్లను అమ్మాలని ఒత్తిడి చేస్తోంది. ఈ విధానాలను తిప్పికొట్టడానికి మేడే స్ఫూర్తితో మే20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దాం!' అని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం కర్నూలు కార్యదర్శి ఆర్.సునీయ కుమార్ అన్నారు. మేడే సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఆయన మాటల్లో....

పెన్షన్ సౌకర్యం, సీనియర్ ఉద్యోగులకు అదనపు ఇంక్రిమెంట్, ఫర్నిచర్ ఖర్చుల తిరిగి చెల్లింపు, మెయిడ్ అలవెన్స్, కొత్త నియామకాలు, మెరుగైన బదిలీ విధానాలు , విద్యా అర్హతల గుర్తింపు వంటి పెండింగ్ సమస్యలను ఎల్ఐసి యాజమాన్యం పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తోంది.

మనమంతా ఉద్యోగులం, కార్మికులం. మన వ్యక్తిగత విశ్వాసాలు ఇంటికే పరిమితం. కానీ ప్రభుత్వాలు రాజకీయ లబ్ధి కోసం వాటిని బహిరంగంగా చర్చించి, మన మధ్య విభేదాలు సృష్టిస్తున్నాయి. మన ఐక్యతను దెబ్బతీస్తున్నాయి. ఉద్యోగ, కార్మిక వర్గాలు తమ హక్కులను సాధించుకోవాలంటే ఐక్యత, అవగాహన , పోరాటం తప్పనిసరి.

ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఎఐఐఇఎ) ఈ సమస్యలపై పోరాటానికి సిద్ధమైంది. మే 20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. ఇది మన కోసం, మన పిల్లల భవిష్యత్తు కోసం చేసే పోరాటం. కేంద్ర కార్మిక సంఘాలు కూడా ఇదే రోజు సమ్మెలో పాల్గొంటున్నాయి. మే 20న చరిత్రలో కనీవినీ ఎరుగని స్థాయిలో సమ్మె జరగబోతోంది. కడప డివిజన్ గతంలోలాగే ఈ సమ్మెను కూడా విజయవంతం చేస్తుంది!.

కార్పొరేట్ శక్తులు 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడ్‌ల పేరుతో కార్మిక వర్గ ఐక్యతను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నాయి. మన హక్కులపై జరగబోయే ఈ దాడిని తిప్పికొట్టడానికి మేడే స్ఫూర్తితో ఐక్యంగా



ఆర్,సునీయకుమార్

పోరాడాల్సిన సమయం ఇది. మే డే వర్ధిల్లాలి! కార్మిక ఐక్యత వర్ధిల్లాలి! మే 20 దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దాం!.

డ్రగ్స్ పై అవగాహన అవసరం

ఎన్ఆర్ఎక్స్ డ్రగ్స్ పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి-పత్తికొండ

ఎన్ఆర్ఎక్స్ డ్రగ్స్ మందులపై మెడికల్ ఏజెన్సీలు, యాజమాన్యాలు అవగాహన పెంచుకోవాలని ఈగల్ ఎస్ఐ కె.సుజన్ కుమార్ పేర్కొన్నారు. పత్తికొండ పట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో పత్తికొండ మెడికల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ నీలకంఠ అధ్యక్షతన జిల్లా ఈగల్ టీం ఆధ్వర్యంలో జిల్లా ఈగల్ టీం ఎస్ఐ కె.సుజన్ కుమార్, పత్తికొండ అర్బన్ సిఐ జయన్న ,పత్తికొండ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగరాజు ఎన్ఆర్ఎక్స్ డ్రగ్స్ మందుల వాల్ పోస్టల్ ను విడుదల చేసారు.

ఈ సందర్భంగా ఈగల్ ఎస్ఐ కె. సుజన్ కుమార్, పత్తికొండ అర్బన్ సిఐ జయన్న మాట్లాడుతూ ఎన్ఆర్ఎక్స్ డ్రగ్స్ అంటే నార్కోటిక్ , సైకోట్రోపిక్ ఔషధాల అని తెలుసుకోవాలన్నారు. ఎన్ఆర్ఎక్స్ ఉల్లంఘనల వల్ల వచ్చే ప్రమాదాలు పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్ఆర్ఎక్స్ డ్రగ్స్ వాడడం వల్ల రోగుల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుంది, మందులపై ఆధారపడే అలవాటు ఏర్పడుతుందన్నారు. డ్రగ్ మిస్యూస్, డ్రగ్



ఎన్ఆర్ఎక్స్ డ్రగ్స్ పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు, నిర్వహకులు

అడిక్షన్ పెరుగుతుందన్నారు. డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ ప్రకారం మీ లైసెన్స్ రద్దు కావచ్చు, జరిమానాలు విధించబడవచ్చు. క్రిమినల్ కేసులునమోదు చేయవచ్చని తెలిపారు. మెడికల్ షాపుల వారు. పాటించాల్సిన నియమాలను వివరించారు. ఎన్ఆర్ఎక్స్ డ్రగ్స్‌ను కేవలం డాక్టర్ చేయబడిన ప్రిస్క్రిప్షన్ మీద మాత్రమే ఇవ్వాలన్నారు.

రికార్డును మినిమం 2 సంవత్సరాలు సక్రమంగా నిర్వహించాలని, ప్రతి విక్రయాన్ని ప్రిస్క్రిప్షన్ రిజిస్టర్ నమోదు చేయాలన్నారు. డాక్టర్ పేరు, ఎంసిఐ నంబర్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మనందరం చట్టబద్ధంగా వ్యవహరించి, సమాజంలో ఆరోగ్య భద్రతను కాపాడేందుకు ముందుండాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ షాప్ యాజమాన్యాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి ఘన సన్మానం

ప్రజాశక్తి- మద్దికేర :పదవి విరమణ చేసిన ఉపాధ్యాయుడు గోపాల్‌కు మంగళవారం ఎంఇఒ రంగస్వామి అధ్యక్షతన ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పదవి విరమణ సందర్భంగా ఉపాధ్యాయుడు గోపాల్ మాట్లాడుతూ తాము ఉద్యోగ జీవితంలో విద్యార్థుల పట్ల చూపిన కృషి, నిబద్ధత, విద్యార్థులకు అందించిన సహకారం గురించి తెలిపారు.ఉద్యోగ జీవితంలో జరిగిన కొన్ని ప్రత్యేకమైన సంఘటనలు, విద్యార్థులతో కలిసి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఇతర ప్రభుత్వ ప్రైవేటు స్కూళ్లలో పనిచేసే ఉపాధ్యాయులు, ఇతర శాఖల అధికారులు శాలువాలు పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఎంపిడిఒ కొండయ్య, యుటిఎఫ్ నాయకులు నాగరాజు, విశ్వనాథ్, ఎఇ రవికుమార్, హౌసింగ్ ఎఇ ఉమాకాంత్, ఉపాధ్యాయులు ఉపాధ్యాయురాలు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.



వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా సభ్యులకు సూచించారు.. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ సొసైటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, పిడుగులు పడినపుడు బాధితులను ఆదుకునే చర్యలు చేపట్టాలన్నారు. అలాగే స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలు చేపట్టాలని, అనాథ పిల్లలను ఆదుకునే చర్యలు, వారిని చదివించే ఏర్పాట్లు చేయాలని, పేద పిల్లలకి అవసరమైన స్కూల్ యూనిఫారంలు, షూస్, నోట్ పుస్తకాలు అందచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సభ్యులకు సూచించారు. చైర్మన్ కెజి. గోవిందరెడ్డి, వెంకటకృష్ణ సెక్రటరీ లు రెడ్ క్రాస్ సంస్థ తరపున బ్లడ్ డొనేషన్ క్యాంపులు నిర్వహించి అవసరార్థులకు అందించే చర్యలు, కంటి శుక్లాలు , ఆర్గాన్ డొనేషన్లు చేసే చర్యలు తీసుకుంటున్నామని, వారి పిల్లలకు చదువు విషయంలో అండగా ఉంటున్నామన్నారు.



రెడ్‌క్రాస్ సొసైటీ సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ఉద్యోగ విరమణ తప్పనిసరి

పారిశుధ్య తనిఖీదారులకు ఆత్మీయ వీడ్కోలు



ప్రజాశక్తి-కర్నూలుకార్పొరేషన్ : ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ తప్పనిసరి అని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అన్నారు. బుధవారం నగరపాలకలో పారిశుధ్య తనిఖీదారులుగా పనిచేస్తూ పదవి విరమణ పొందిన యు.హరినాథ్, యు. శ్రీనివాసులకు స్థానిక ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని కౌన్సిల్ హాల్లో ఆత్మీయ వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడి, ప్రోత్సాహించిన కుటుంబ సభ్యులను అభినందించారు. అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఒ ఇశ్రాయేల్, సూపరింటెండెంట్లు రామక్రిష్ణ, సూరరంగా బాబు, ఆర్ఐ శ్రీకాంత్, పాల్గొన్నారు.

మొండి బకాయి చెక్కు అందజేత

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

నగరపాలక సంస్థ కార్యాలయంలో తమ రూ.29.12 లక్షల మొండి బకాయిలను అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణకు అందజేస్తున్న మార్కెట్ యార్డు సిబ్బంది. చిత్రంలో ఆర్ఒ జునైద్, ఆర్ఐలు తిప్పన్న, రాజు ఉన్నారు

20 ఏళ్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్



పీఎం సూర్య ఘర్ పథకం కింద సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకుంటే 20 ఏళ్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం ఉంటుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాష అన్నారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకం అమలు పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పీఎం సూర్య ఘర్ పథకం కింద ఇప్పటివరకు 87 477 మంది రిజిస్టర్ అయ్యారన్నారు, ఎస్సీ, ఎస్టీ కింద 81390 మంది ఇతరులు 6087 మంది రిజిస్టర్ అయ్యారన్నారు. ఎపిఇఆర్‌సి నుంచి ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన అప్రూవల్ వచ్చిన వెంటనే ప్రాజెక్టులు ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇని ఆదేశించారు. 442 మాత్రమే చేశారని వాటిలో కూడా పురోగతి తీసుకొని రావాలన్నారు. మోడల్ సోలార్ గ్రామాల కింద నియోజకవర్గానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేశామన్నారు. అందులో భాగంగా 6 గ్రామ పంచా యతీలను, సిఎం హామీ కింద పుచ్చకాయల మాడ గ్రామ పంచాయతీని ఎంపిక చేశామన్నారు. రూ1.40.లక్షల విలువ చేసే 2 కిలో వాట్స్ సోలార్ ప్యానెల్ కొని ఇన్‌స్టాల్ చేసుకుంటే, రూ60 వేలు సబ్సిడీ వస్తుందన్నారు. పీఎం సూర్యగర్ పథకంపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంల ఎస్ఇ ఉమాపతి, ఇఇ ఓబులేసు, డిఆర్‌డిఎ పిడి రమణారెడ్డి, మెప్మా పీడీ నాగశివ లీల, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ పాటలతో అలరించిన టిజివి కళాక్షేత్రం

ప్రజాశక్తి - కర్నూల్ కల్చరల్

ఆలయాన వెలసిన ఆ దేవుని రీతి అంటూ శ్రీశ్రీ రాసిన పాటను పాడి కళాకారుడు బాలవెంకటేశ్వర్లు సభ ప్రారంభించారు. ప్రజానాట్యమండలి కళాకారుడు ఎంపి బసవరాజు కణకణమండే సూర్యుడే శ్రీశ్రీ అంటూ దేవేంద్ర రాసిన పాటను పాడారు. కళారత్న పత్తిఓబులయ్య మాట్లాడుతూ పద్యసాహిత్యం నుండి ఆధునిక సాహిత్యంలో అనేకరచనలు చేసి ఈ ప్రపంచాన్ని శాసించిన మహాకవి అంటూ ప్రసంగించారు. విప్లవపంథా సాహిత్యం సృష్టించిన మహాకవి అన్నారు. నమ్ముకున్న ఆశయాలకోసం బతికాడని అన్నారు. సభాధ్యక్షులుగా వ్యవహరించిన నంది అవార్డు గ్రహీత మహమ్మద్ మియా మాట్లాడుతూ ఆకాశవీధిలో అందాల జాబిలి అంటూ యుగళ గీతాన్ని పాడి అలరించారు. అంతకుముందు సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్,పత్తి ఓబులయ్యలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. కళాకారులు సామెల్ పద్యాలను పాడి సభను అలరించారు. సభలో కళాకారులు భాస్కర్, యాగంటీశ్వరప్ప, సంగా ఆంజనేయులు పాల్గొన్నారు.



శ్రీశ్రీకి నివాళి అర్పిస్తున్న పత్తిఓబులయ్య, కెంగార మోహన్ , తదితరులు

ప్రశాంతంగా ముగిసిన పాలిసెట్ పరీక్ష

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో పాలిసెట్ ఎంట్రన్స్ అర్హత పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరిగిందని పరీక్షా కోఆర్డినేటర్ శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం కర్నూలు, ఆదోని కేంద్రాలలో జరిగిన పరీక్షకు 7366 మందికి గాను 6442 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. 944 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని అన్నారు. ఈ పరీక్షకు, 87.45 శాతం ఆదర్శ నమోదయింది. కర్నూలు నగరంలో జరిగిన పాలీసెట్ ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహణను పరీక్ష పరిశీలకులు డాక్టర్ బి. నాగేశ్వరరావు, టి శ్రీనివాసులు కేంద్రాలను సందర్శించి పరిశీలన చేశారు. కర్నూలు నగరంలో జరిగిన పరీక్షకు 4595 మందికి గాను 4003 మంది, విద్యార్థులు హాజరుకాగా 87.10 శాతం హాజరు శాతం నమోదయింది ఆదోని పరీక్షా కేంద్రంలో జరిగిన పరీక్షకు-2771 మంది విద్యార్థులకు గాను 2439 మంది, విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.